ఈనాడు అమరావతి

సోమవారం 28 ఆగస్టు 2017 | 20 పేజీలు

రజత సింధూరం...



పి.వి.సింధు మరోసారి మెరిసింది. గ్లాస్గోలో ఆదివారం రాత్రి జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఓడినా రజత పతకాన్ని సొంతం చేసుకుంది. ఆమె ప్రదర్శన యువ బ్యాడ్మింటన్ క్రీడాకారుల్లో ఎంతో స్ఫూర్తినింపింది. సింధు విజయవాడలోని పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థిని. ఒలింపిక్స్‌లో రజత పతకం సొంతం చేసుకున్న సింధుకి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నగదు పారితోషికం, ఇంటిస్థలం, గ్రూపు–1 కేడర్‌లో డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం ఇచ్చి ప్రోత్సహించారు. కృష్ణా జిల్లా విజయవాడలోనే రాష్ట్ర భూపరిపాలనాశాఖ కార్యాలయంలో ఇటీవల ఆమె ఉద్యోగంలో చేరారు.

- విజయవాడ క్రీడలు-న్యూస్‌టుడే



ఆదివారం ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారతి ట్రస్టులో వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో గవర్నర్ నరసింహన్, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, మంత్రి కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, కలెక్టర్ లక్ష్మీకాంతం తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో ముఖాముఖి..3లో

సలహా సంస్థల సేవలే ముద్దు..!

- అంచనాల తయారీకి కోట్ల రూపాయల దుబారా
- ఉన్నతాధికారి కనుసన్నల్లో నడుస్తున్న కన్సల్టెన్సీ కంపెనీ
- పురపాలక, నగరపాలక ఇంజినీర్ల నిర్వాకం



మంగళగిరిలో తాగునీటి పైపులైను కనెక్షన్ పనులు

ఈనాడు, అమరావతి

మీరు కన్సల్టెన్సీ కంపెనీతో అంచనాలు (ఎస్టిమేట్స్) తయారు చేయించకుండా సొంతంగా చేసుకుని రావటం ఏమిటి?
– ఓ పురపాలక ఇంజినీర్‌ను ఉద్దేశించి ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఒక ఉన్నతాధికారి అన్న మాటలివి.

సలహా సంస్థల (కన్సల్టెన్సీ కంపెనీ) సేవలకు ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం, పురపాలకశాఖ ఎలా వత్తాసు పలుకుతుందో చెప్పటానికి ఇదో నిదర్శనం.

పట్టణాల్లో పురపాలక, ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం చేపట్టే పనుల్లో అత్యధికం సలహా సంస్థలు గీసిచ్చిన డిజైన్లు.. అంచనాలే గీటురాయి కాబోతున్నాయి. శాఖ ఇంజినీర్లు ఎవరైనా క్షేత్రస్థాయిలో పరిశీలించి డిజైన్లు గీస్తుంటే వాటికి ఆమోదం తెలపటానికి ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఉన్నతాధికారులు రుసరుసలాడుతున్నారు. మీరెందుకు అంచనాలు తయారు చేస్తారు? కన్సల్టెన్సీ కంపెనీలు ఉండగా వాటితో గీయించుకోవచ్చుకదా? అంటూ ఉచిత సలహాలిస్తూ శాఖ ఇంజినీర్లను పక్కకు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విచిత్ర పరిస్థితి కృష్ణా- గుంటూరు జిల్లాల్లో ఎక్కువగా ఉందని పురపాలక ఇంజినీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నెలవారీ జీతం పొందుతూ తాను పనిచేసే పట్టణంలో కల్వర్టులు, మురుగునీటి డ్రెయిన్లు, కాలువలు, మంచినీటి పైపులైన్ల అనుసంధానం వంటి పనుల నిర్మాణానికి అంచనాలు తయారు చేసే నైపుణ్యాలు, శక్తి సామర్థ్యాలు లేకపోతే (మిగతా 19లో)

తప్పని నిరీక్షణ

- ఆగిన సూక్ష్మనీటి సేద్యం యూనిట్ల మంజూరు
- రెండు నెలలుగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రైతుల అవస్థలు
- జీఎస్టీ ప్రభావంతో 6శాతం మేర అన్నదాతలపై భారం

ఈనాడు – అమరావతి



నీటి వృథాను అరికట్టి ప్రతి బొట్టును సద్వినియోగం చేసుకునేలా ప్రవేశపెట్టిన సూక్ష్మనీటి సేద్యం సత్ఫలితాలను ఇస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లోనూ ఇది అన్నదాతలను బాగా ఆదుకుంటోంది. సాగునీటికి కటకటలాడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం ఈ సేద్యంపై రైతుల్లో అవగాహన కల్పిస్తోంది. భారీగా రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీపై యూనిట్లు అందిస్తోంది. దీంతో బాగా ఆదరణ పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అన్నదాతల నుంచి అనూహ్య స్పందన కనిపించింది. అయితే యూనిట్ల మంజూరు విషయానికి వచ్చేసరికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత రెండు నెలల నుంచి ఒక్కటి (మిగతా 19లో)

మనిషిలోని వివేకాన్ని మౌఢ్యానికి తాకట్టు పెట్టొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ జి.సమరం


పటమట, న్యూస్‌టుడే: ముహూర్తాలను నమ్ముకోవడం మనిషిలోని వివేకాన్ని మౌఢ్యానికి తాకట్టు పెట్టడమేనని, ముహూర్తాల విశ్వాసాలను విడనాడితే తప్ప ప్రగతి ఉండదని డాక్టర్ జి.సమరం అన్నారు. నాస్తిక మిత్రమండలి అధ్యక్షుడు శ్రీహరి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నాస్తిక కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ముహూర్తాలలో శాస్త్రీయత ఎంత? అనే అంశంపై డాక్టర్ సమరం ప్రసంగించారు. ఏ పనికైనా అమావాస్య మంచిది కాదని, అమావాస్య రోజున ఏ కార్యం తలపెట్టినా సక్రమంగా జరగదని అనుకుంటారన్నారు. అక్షరాస్యులైనా, నిరక్షరాస్యులైనా సూర్యుడు, భూమి, చంద్రుడు గురించి, వాటి కదలికలు, స్థితిగతులు గురించి శాస్త్రీయ అవగాహన ఉంటే, అమావాస్య, పౌర్ణమిలు ఎలా కలుగుతాయో చెప్పగలరని అన్నారు. కానీ విద్యని, వివేకాన్ని, విజ్ఞతను వదిలి అమావాస్య చెడ్డది అనుకోవడం హాస్యాస్పదమన్నారు. అమావాస్య అయినా, మరో రోజు అయినా ఏ మాత్రం అనర్థదాయకం కాదన్నారు. జ్యోతిష్య శాస్త్రం, పంచాంగం గ్రహాలు, నక్షత్రాలు వాటి స్థితిగతుల ఊహాగానాల మీద సిద్ధాంతీకరించారన్నారు. పంచాంగంలో 9 గ్రహాలు పేర్కొన్నారని అందులో సూర్యుడు, చంద్రుడుని కూడా గ్రహాలు అన్నారని, రాహువు, కేతువులనేవి లేకపోయినా గ్రహాలుగా పేర్కొన్నారన్నారు. పెళ్లిళ్లకు ముహూర్తాలు, ఉద్యోగంలో చేరడానికి, వ్యాపారం ప్రారంభించడానికి, ప్రయాణం చేయడానికి, జననానికి.. ఇలా ప్రతిదానికి శుభ ముహూర్తాలని చూడడం మౌఢ్యానికి పరాకాష్ట అన్నారు. ఒక పని విజయవంతం కావడం, కాకపోవడం, దానికి సంబంధించిన వ్యక్తుల కృషి మీద, ప్రణాళికపైన ఆధారపడి ఉంటుందే తప్ప తిథి, వార, నక్షత్రాల మీద, వాటి స్థితిగతుల మీద ఏమాత్రం లేదన్నారు. సదస్సులో డాక్టర్ మారు, రశ్మి, డాక్టర్ కీర్తి, డాక్టర్ విజయం, నియంత తదితరులు పాల్గొన్నారు.

30న ఉద్యోగ మేళా

కరెన్సీనగర్(విజయవాడ), న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి కార్యాలయం 'నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్' ద్వారా నిర్వహించే ఉద్యోగమేళాను ఈనెల 30న(బుధవారం) నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి డాక్టర్ పీవీ రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏజీఎస్ లిమిటెడ్ కంపెనీలో కస్టమర్ సపోర్ట్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు(90)కు ఇంటర్ /డిగ్రీ ఉత్తీర్ణతతో కల్గిన అభ్యర్థులు ఈ నెల 28 నుంచి 30 వరకు తమ పేర్లను 'నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్' నమోదు చేసుకొని జాబ్ సీకర్ ద్వారా లాగ్‌ఇన్ అయి సంబంధిత ఐడీ నంబరుతో నేరుగా మేళాకు రావాల్సి ఉంటుంది. ఆసక్తి, అర్హత అభ్యర్థులు కల్గిన తమ బయోడేటా, జిరాక్స్ కాపీలు, ఆధార్‌తో 30న ఉదయం 10.30 గంటలకు నేరుగా హాజరుకావాలన్నారు.

ముందుంది కొలువుల పండగ

"నిజంగా ఇంజినీరింగ్ విద్యార్థులకు ఇది శుభవార్తే. వచ్చే ఏడాది నాటికి టెలికాం రంగం 30 లక్షల ఉద్యోగాలు సృష్టించగలదని అసోచామ్, కేపీఏంజీ తాజా అధ్యయనంలో పేర్కొన్నాయి. విస్తరిస్తున్న 4జీ సాంకేతికత, స్మార్ట్ ఫోన్లు, డిజిటల్ వాలెట్లు వాడకం పెరగడం, డేటా వినియోగం పెరిగిన క్రమంలో ఈ అవకాశాలు రానున్నాయని వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడున్న మానవ వనరులు చాలవని, సైబర్ భద్రత నిపుణులు, అప్లికేషన్ డెవలపర్‌లు మొబైల్ సాంకేతిక నిపుణులు అవసర అవుతారని తెలిపింది. 5జీ మిషన్ టూ మిషన్ వంటి నూతన పరిజ్ఞానం, సమాచార రంగ విస్తృతి క్రమంలో 2020 నాటికి 8.70 లక్షల ఉద్యోగాలు పుట్టుకొస్తాయంది.'



టెలికాం రంగంలో భారీ ఉద్యోగాలు

కోర్ కోర్సుల్లో నైపుణ్యాలే కీలకం

- న్యూస్‌టుడే, పొన్నూరు

టెలికాం రంగంలో ఇంత పెద్దమొత్తంలో ఉద్యోగ అవకాశాలకు కారణం సాంకేతిక రంగంలో మార్పులే అంటున్నారు నిపుణులు. ఈసీఈ, ఈఈఈ విద్యార్థులే గాక, ఐటీ, సీఎస్ఈ విద్యార్థులు గేట్‌లో మంచి ఫలితాలు సాధించిన వారు, ఎంటెక్ పూర్తి చేసినవారికి ఇదొక సువర్ణ అవకాశంగా పేర్కొంటున్నారు. ఆ సంస్థలో ఉద్యోగాన్ని దక్కించుకోవాలంటే కొన్ని కోర్సులపై మెట్టు మెట్టుకు పట్టు సాధిస్తే సులభం అవుతుందని సూచిస్తున్నారు.

మూడే మూడులక్షలు..

గుంటూరు, కృష్ణా జిల్లాల్లో 92 ఇంజినీరింగ్ కళాశాలలు, 5 విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ఇంజినీరింగ్ ఆయా విభాగాల్లో 3,4 సంవత్సరాల విద్యాభ్యాసం చేసేవారు సుమారు 3లక్షల వరకు ఉంటారని కళాశాలల వర్గాలు పేర్కొంటున్నాయి.

భవితకు బాట.. కోర్ కోర్సులు..

విద్యార్థులు ముఖ్యంగా కోర్ సబ్జెక్టులైన మైక్రో కంట్రోలర్, డిజిటల్ ఎలక్ట్రానిక్స్, పవర్ ఎలక్ట్రానిక్స్, నెట్‌వర్కింగ్, వైర్లెస్ కమ్యూనికేషన్, మొబైల్ నెట్‌వర్కింగ్, ఆర్కిటెక్చర్, పాటు నూతనంగా టెలికాం రంగంలో ప్రముఖంగా ఉండే ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), సీ, సీ+, జావా తదితర కోర్సులపై నైపుణ్యాలు సాధించడంతో పాటు మొబైల్ యాప్, ఆండ్రాయిడ్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై పట్టు సాధించగలిగితే ఉద్యోగం సంపాదించడం పెద్ద కష్టమేమి కాదని నిపుణులు అంటున్నారు.



సమయముంది మిత్రమా..

విద్యార్థులు ఖాళీ సమయాన్ని వృథా చేసుకోకుండా ఐఓటీ పరిజ్ఞానం, హార్డ్‌వేర్ సహకారంతో లైవ్ ప్రాజెక్టులను రూపొందించే ప్రక్రియపై దృష్టి సారిస్తే ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తుందని ఆ రంగంలోని వారు చెబుతున్నారు. దీంతో పాటు అప్లికేషన్లను రూపొందించి విధివిధానాలపై కూడా అవగాహన పెంపొందించుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందటంతో ముందంజలో ఉండడానికి దోహదపడుతుందని అంటున్నారు.

ఉత్తేజం నింపింది..

ప్రస్తుతం బహుళ జాతి కంపెనీల్లో సైతం ప్రాంగణ ఎంపికలు నిర్వహించే ప్రక్రియ మందకోడిగా కొనసాగడంతో విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లో సైతం కొంత ఆందోళన ఉంది. టెలికాం రంగంలో లక్షల్లో ఉద్యోగ అవకాశాలు రానున్నాయని అసోచామ్ కేపీఎంజీ సర్వే ద్వారా వెల్లడి కావటం వారిలో నూతన ఉత్తేజాన్ని నింపినట్లయింది.

కీలకంగా మారనున్న గేట్

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే గేట్ పరీక్షలు విద్యార్థి భవిష్యత్తుకు కీలకం కానుంది. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని గేట్‌లో మంచి ర్యాంకు సాధిస్తే ఉద్యోగ అవకాశాల్లో కూడా ముందంజలో ఉండడానికి దోహదపడుతుందని చెబుతున్నారు. ఇప్పటినుంచే విద్యార్థులు అందుకు తగిన ప్రణాళిక ప్రకారం సమయాన్ని వినియోగించడం లాంటి అంశాలపై కేంద్రీకరించాల్సిన సమయం ఆసన్నమైందని అంటున్నారు.



ఇదొక మంచి అవకాశం: - నాయని, ఈసీఈ విద్యార్థిని



టెలికాం రంగంలో పెద్దసంఖ్యలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది మంచి అవకాశంగా భావిస్తున్నాం. ఉద్యోగం సంపాదించడానికి ఏఏ శిక్షణ తీసుకోవాలో ఇప్పటికే ఆచార్యులు వెల్లడించారు. ఆ శిక్షణ తీసుకుని తప్పనిసరిగా ఉద్యోగం సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తాం.

సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి కేంద్రీకరించాలి



పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఆయా అంశాలపై అవగాహన పెంచుకుంటే తప్పనిసరిగా ఉద్యోగాన్ని సంపాదించవచ్చు. టెలికాం రంగంలో వచ్చే ఏడాది ఎన్నో అవకాశాలున్నాయి. ఇప్పటికే సర్వేలు ఈ విషయాలను వెల్లడించాయి. ఇందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే ప్రయత్నంలో ఉన్నాం.

ముత్తినేని సుమన్, విజ్ఞాన్ లారా ఈసీఈ విభాగాధిపతి

మనసుకు, భాషకు సంబంధం

పటమట: మనిషి మాట్లాడే భాషకు, మనసుకు సంబంధం ఉంటుందని, మనసులో స్పష్టత ఉంటేనే భాషలో కూడా స్పష్టత ఉంటుందని ఎన్ఎల్‌పీ మాస్టర్ ట్రైనర్ డాక్టర్ వి.సురేష్ బాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ సైకాలజిస్టు ఫెడరేషన్ (ఏపీఎఫ్) ఆధ్వర్యంలో సైకాలజిస్టులు, ఉపాధ్యాయులకు ఒకరోజు ఎన్ఎల్‌పీ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని పటమటలోని త్రివేణి మహిళా కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో విద్యార్థులు, యువకులు, మహిళలు ఏ రంగంలో పనిచేస్తున్నా, ఆ రంగంలో ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు ఎన్ఎల్‌పీ ఒక అద్భుతమైన ప్రక్రియ అన్నారు. మనిషి తాను ఉన్న రంగంలో ఉన్నత లక్ష్యాన్ని సాధించాలంటే ఆ లక్ష్యానికి సంబంధించిన అన్ని అంశాలు స్పష్టంగా ఉండాలన్నారు. ఆ స్పష్టత భాష, చూపు, వినడం ద్వారా మనసును ఏ విధంగా ప్రేరేపించవచ్చో వివరించారు. కార్యక్రమంలో ఏపీఎఫ్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ టైటస్ పాల్, ప్రత్యూష సుబ్బారావు, ఎం.ఎం.ముఖర్జీ, మోటూరి రాణి, సోమయాజులు, విజయవాడ చిల్డ్రన్స్ స్కూల్ అసోసియేషన్ ప్రతినిధి చంద్ర సరళ, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్లు, సైకాలజిస్టులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వి.సురేష్ బాబు



తెలుపు స్వచ్ఛం... అందుకే ఇష్టం

విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విజయవాడ పరిసర ప్రాంతాల్లోని పలు కళాశాలల విద్యార్థులు ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుతో ముఖాముఖిలో పాల్గొన్నారు. విద్యార్థినులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. స్వర్ణభారత్ ట్రస్టులో జరిగిన వైద్యశిబిరంలో ఆయన మాట్లాడారు.
– ఈనాడు, అమరావతి

విద్యార్థుల ప్రశ్నలకు ఉపరాష్ట్రపతి సమాధానాలు

ప్రశ్న: మీరు ఎప్పుడూ తెలుపు దుస్తుల్లోనే కనిపిస్తారు. ఎందుకు.?



వెంకయ్యనాయుడు: తెలుపు స్వచ్ఛమైనది. అందుకే నాకు చాలా ఇష్టమైనది. పార్లమెంట్ లోనూ నన్ను తాజాగా ఓ ప్రశ్న అడిగారు. ఉప రాష్ట్రపతి అయ్యాక మీ దుస్తులు మారతాయా అని, కానీ.. నా డ్రెస్సు మారదు.. అడ్రస్ మాత్రమే మారుతుంది, ఇదే తెలుపు దుస్తుల్లో ఉంటానని స్పష్టం చేశాను.

- స్వరూప

ప్రశ్న: మా అందరికీ మీరు స్ఫూర్తి, మరి మీ జీవితానికి ఎవరు స్ఫూర్తి?



వెంకయ్యనాయుడు: నాకు జీవితానికి ఓ మార్గం చూపించింది, సమాజం కోసం జీవించాలని నేర్పించింది.. రాష్ట్రీయ స్వయం సేవక్ ప్రచారకులుగా ఉన్న బోగాది దుర్గాప్రసాద్. ఆయన నాకు చిన్నప్పుడు సామాజిక స్పృహ కలిగించారు. సమాజానికి సేవ చేయాలనే భావన నాలో కలగడానికి కారణం.. నానాజీ దేశ్‌ముఖ్. ఆయన రాజకీయాలను వదిలిపెట్టి వెళ్లి చిత్రకూట్ ప్రాంతంలో ఐదొందల గ్రామాల్లో చేస్తున్న సేవా కార్యక్రమాలు నాలో స్ఫూర్తిని నింపాయి. అప్పుడే స్వర్ణ భారత్ ట్రస్ట్‌ను నెలకొల్పి గ్రామీణ భారతానికి అండగా ఉండాలని నిర్ణయించుకున్నాను. నా రోల్ మోడల్ సర్దార్ వల్లభాయ్‌పటేల్. నాలాగే రైతు కుటుంబంలో పుట్టారు. చాలా క్రమశిక్షణ కలిగిన ఉక్కు మనిషి. ఐపీఎస్, ఐఏఎస్‌లను దేశానికి వరంగా అందించిన వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్. చివరి వరకూ దేశం కోసం జీవించారు.

- స్వప్న

ప్రశ్న: మీ విజయవంతమైన జీవితానికి ఫార్ములా ఏంటి?



వెంకయ్యనాయుడు: జీవితానికి ఫార్ములా అంటూ ఏదీ ఉండదు. కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణతో మెలగడం ఒక్కటే విజయానికి దారి. నమ్మిన దాని కోసం నిలబడటం వల్లే ఈ స్థాయికి చేరుకోగలిగాను. మంచిగా బతకడం చాలా కష్టం. అదే చెడుగా జీవించడం చాలా తేలిక. నిజాన్ని చెబుతూ, ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడడం అనేది చాలా కష్టం. అలా అని ఆ మార్గం వదిలేస్తే.. విజయం దరి చేరదు. కష్టపడి పనిచేయడం, నిబద్ధత, క్రమశిక్షణ, నువ్వు చేసే పని.. మాత్రమే నిన్ను విజేతగా నిలబెడుతుంది.

- చరిత

ప్రశ్న: వ్యక్తిగత, రాజకీయ జీవితాన్ని మీరు ఎలా సమర్థంగా నిర్వహించగలుగుతున్నారు.?



వెంకయ్యనాయుడు: ప్రజా జీవితంలో కుటుంబ జీవితాన్ని కొంత త్యాగం చేయక తప్పదు. ప్రజలకు సేవ చేయడం, రాజకీయ నాయకుడిగా ఉండటం, పదవులకు న్యాయం చేయాలంటే వ్యక్తిగత జీవితాన్ని కొంత సర్దుకుపోవాల్సి ఉంటుంది. కుటుంబంతో కలిసి బయటకు వెళ్లడం, పిల్లలతో గడపడం వంటివి త్యాగం చేయాలి. కానీ రాజకీయంలో ఉన్నతమైన పదవిలో ఉంటే దానికి ఎక్కువ సమయం కేటాయించాల్సి ఉంటుంది. పదవికి వన్నె తేవాలనే సంకల్పంతో ఉంటే మానసికంగా సంతృప్తి ఉంటుంది. అలాకాకుండా.. కుటుంబంతో గడపలేకపోతున్నానని బాధపడితే రాజకీయంలో కొనసాగడం కష్టం. నా వరకూ నేను మొదటి నుంచి ఆర్‌ఎస్‌ఎస్, పార్టీ, సిద్ధాంతాల కోసం పనిచేయడంలోనే ఆనందం పొందుతుంటాను. ఈ రోజు చాలా మందిని కలుసుకున్నాను, వారికి సహకరించాను అనేది నాకు సంతృప్తిని ఇస్తుంది.

- సౌజన్య

ప్రశ్న: మీరు అన్ని విషయాలపై ఇంత పరిజ్ఞానం ఎలా సంపాదించారు?



వెంకయ్యనాయుడు: ఇతరుల అనుభవాల నుంచి తెలుసుకోవడం, పుస్తకాలను చదవడం వల్ల పరిజ్ఞానం వస్తుంది. నేను దేశవ్యాప్తంగా అన్ని వర్గాల వారితోనూ కలిసి మాట్లాడటం, తిరగడం చేసినప్పుడు వారి గురించి పూర్తిగా అవగాహన వస్తుంది. ఒకటి.. కష్టపడడం, రెండోది తెలుసుకోవాలనే తపన ఉంటే విజ్ఞానం సొంతమవుతుంది. నిరంతరం నేర్చుకోవాలనే తపన ఉండాలి.

- నిషిత

ప్రశ్న: విద్యావిధానంలో నైతిక విలువలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. పరిష్కారం ఏంటి?



వెంకయ్యనాయుడు: ప్రస్తుత విద్యావిధానంలో సమూలమైన మార్పులు రావాల్సిన అవసరం ఉంది. పురాతన భారతీయ విద్యావిధానం చాలా గొప్పది. మళ్లీ ఆ విద్యావిధానానికి మనం మళ్లాల్సి ఉంది. భారతీయ కుటుంబ వ్యవస్థ అనేది మనకు గొప్ప వరం లాంటిది. చాలా మంది అమెరికాకు వెళ్లి అక్కడ దిగిన ఫొటోలను పంపిస్తుంటారు. అనుబంధాలను పంచుకుంటే వచ్చే ఆనందం మరెందులోనూ లేదు. విద్య అనేది విజ్ఞానం సముపార్జించేది కావాలి. కానీ ఇప్పుడు ఉద్యోగం కోసం విద్య అనే పరిస్థితి వచ్చేసింది. ప్రస్తుత విద్యా విధానంలో విద్యార్థులపై భారం పెరుగుతోంది. కొంత సమయం ఆడుకుని, మరికొంత సమయం కలిసి మెలిసి గడిపేలా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టింది.

- గాయత్రి

ముగిసిన ఉప రాష్ట్రపతి పర్యటన

ఆత్కూరు(ఉంగుటూరు), గన్నవరం, న్యూస్‌టుడే : కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడి రెండు రోజుల పర్యటన ముగిసింది. గుంటూరు జిల్లాలో శనివారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్న వెంకయ్యనాయుడు.. ఆదివారం ఉదయం కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఉదయం 11 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో చెన్నైకి బయలుదేరి వెళ్లారు. స్వర్ణభారత్ ట్రస్ట్‌లో వెంకయ్యనాయుడు ప్రారంభించిన మెగా వైద్య శిబిరంలో హైదరాబాద్ స్టార్ ఆసుపత్రి, విజయవాడ మణిపాల్ ఆసుపత్రులకు చెందిన వైద్యులు పాల్గొని పలురకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులను అందజేశారు. స్వర్ణభారత్ సేవలను రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ప్రశంసించారు. శిక్షణ పొందుతున్న మహిళలు, యువతీయువకులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆత్కూరులో స్వర్ణభారత్ ట్రస్ట్ ఏర్పాటైే ఏడాదిన్నరలో 14 ఉచిత మెగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉచిత మెగా వైద్య శిబిరంలో ఆదివారం 410మందికి వైద్య సేవలు అందించారు. మరో 250 మంది కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 200 మందికి కళ్లజోళ్లను విజన్‌కేర్ ఆధ్వర్యంలో అందించనున్నట్టు స్వర్ణభారత్ ట్రస్ట్ విజయవాడ విభాగం ఛైర్మన్ మండవ ప్రభాకర్ వెల్లడించారు. శిబిరంలో 2డి ఎకో, ఎక్స్‌రే, బీపీ, ఈసీజీ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. హృద్రోగ నిపుణులు డాక్టర్ గూడపాటి రమేష్, డాక్టర్ విజయచైతన్య, నరాల వ్యాధి నిపుణులు డాక్టర్ వి.రవికాంత్, కీళ్లు, మోకాళ్ల వ్యాధుల వైద్యులు డాక్టర్ ఎన్.జగదీష్, సాధారణ వ్యాధుల నిపుణులు డాక్టర్ కె.శ్రీరామ్, ప్రముఖ రేడియాలజిస్టు డాక్టర్ వి.రామకృష్ణ, నొప్పుల నివారణ నిపుణులు డాక్టర్ అజయ్ తదితరులు హాజరై సేవలందించారు. స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఆంధ్రా బ్యాంక్, జీఎమ్ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో శిక్షణ పొందిన 120మంది యువతీ యువకులకు ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, గవర్నర్ నరసింహన్ చేతులమీదుగా అర్హత పత్రాలను అందజేశారు. వీరిలో 105మందికి వివిధ కంపెనీల్లో ఉదోగ్య నియామకపత్రాలు అందజేసినట్లు ఆంధ్రా బ్యాంకు డైరెక్టర్ శివకుమార్ చెప్పారు. కార్యక్రమంలో మంత్రి నక్కా ఆనందబాబు, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, ఎంపీ గోకరాజు గంగరాజు, ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతమ్‌సవాంగ్, కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, స్వర్ణభారత్ ట్రస్ట్ కార్యదర్శి చుక్కపల్లి రామకృష్ణ ప్రసాద్, స్టార్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు. కాగా గన్నవరం విమానాశ్రయంలో ఉప రాష్ట్రపతికి వీడ్కోలు పలికిన వారిలో తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, డాక్టర్ కామినేని శ్రీనివాసరావు, నక్కా ఆనంద్‌బాబు, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి దినేష్‌కుమార్, డీజీపీ ఎన్. సాంబశివరావు, ప్రొటోకాల్ కార్యదర్శి ఎన్.శ్రీకాంత్, నిఘా విభాగం డీజీపీ బి.వెంకటేశ్వరరావు, నగర పోలీస్ కమిషనర్ గౌతమ్‌సవాంగ్, జిల్లా కలెక్టరు లక్ష్మీకాంతం, డీసీపీ క్రాంతి రాణా తదితరులు ఉన్నారు.



ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు వీడ్కోలు పలుకుతున్న మంత్రులు ఆనందబాబు, ఉమా, శ్రీనివాసరావు, గవర్నర్ నరసింహన్ తదితరులు

'మినహాయింపులు లేని పూర్తిస్థాయి రిజర్వేషన్లు కావాలి'

గవర్నర్‌పేట (విజయవాడ), న్యూస్‌టుడే: కాపు, బలిజ, తెలగ కులాలకు మినహాయింపులు లేని పూర్తి స్థాయి రిజర్వేషన్లు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బలిజ, తెలగ, కాపు ప్రతినిధుల సమావేశం తీర్మానం చేసింది. కాపుల రాజకీయ అధికారం కోసం రాష్ట్రంలో తొలిప్రయత్నంగా అందరం కలసికట్టుగా ముందుకు వెళ్లాలని అన్ని శక్తులను ఒకే తాటిపైకి తీసుకురావాలని నిర్ణయించినట్లు సమావేశం అభిప్రాయపడింది. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గవర్నర్‌పేటలోని ఒక హోటల్‌లో 13 జిల్లాలకు చెందిన కాపు, తెలగ, బలిజ కులాలకు చెందిన ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా సమావేశం భవిష్యత్ కార్యాచరణ నిమిత్తం ఇమ్మడి సత్యనారాయణ కన్వీనర్‌గా, మల్లెమూడి కోటయ్యనాయుడు కో కన్వీనర్‌గా అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసి రాజకీయ ప్రత్యామ్నాయం కోసం కలసికట్టుగా పోరాటం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. కన్వీనర్ ఇమ్మడి సత్యనారాయణ మాట్లాడుతూ అడ్‌హాక్ కమిటీలో వ్యక్తి నాయకత్వం లేదని సమష్టి నాయకత్వం ఉందని తెలిపారు. తాము ఏ పార్టీకి విధేయులు కాదని స్పష్టం చేశారు. యువజనులు, మహిళలు, వైద్యులు, చార్టెర్డ్ ఎకౌంట్లతో ఒక కమిటీని ఏర్పాటు చేయటమే తమ తక్షణ కర్తవ్యమని స్పష్టం చేశారు. అన్ని శక్తులను ఒకే తాటిపైకి తీసుకువచ్చి రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

అడ్‌హాక్ కమిటీ ఇదే...: కన్వీనర్‌గా ఇమ్మడి సత్యనారాయణ, కోకన్వీనర్‌గా మల్లెమూడి కోటయ్యనాయుడు, సభ్యులుగా ఎస్వీ రాజు, ఎం.సర్వమంగళ, వాదా ప్రసాద్, మండలి శేషగిరిరావు, ప్రొఫెసర్ కె.వి.వి.సత్యనారాయణ, కె.ఆంజనేయులు, కె.రామకృష్ణ, గాళ్ల వెంకటేశ్వరరావు, ఆల దుర్గారావు, కొప్పుల వెంకట్, గాజుల వెంకటేశ్వరరావు, వి.నాగేశ్వరరావు, బండారు హరి లను నియమించారు.

ఉద్యోగాలను భర్తీ చేయాలి: కృష్ణయ్య

పట్నంబజారు, న్యూస్‌టుడే: బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. ఆదివారం పాతగుంటూరులోని బాదినేడి బ్రహ్మయ్య కళ్యాణమండపంలో బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు కావస్తున్నా బి.సి.లు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకంజలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 56 శాతం ఉన్నా ఏ ఒక్క రాజకీయ పార్టీ సీట్లు కేటాయించలేదన్నారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 14 లక్షలు, రాష్ట్రంలో ఉన్న లక్ష ఉద్యోగాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అన్ని నియోజకవర్గాలు, మండల, గ్రామ స్థాయిల్లో బి.సి. సంఘాలతో సమావేశాలు నిర్వహించి భవిష్యత్తు కార్యచరణపై తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కొద్ది రోజుల్లో విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరుల్లో బహిరంగసభలు నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. బి.సి.లకు అన్యాయం జరుగకుండా కాపుల్ని బి.సి.ల్లో చేర్చటం సరైన విధానం కాదన్నారు. కాపులను బి.సి.ల్లో చేర్చే విషయం సాంకేతిక పరమైన అంశమని, ఇది రాజకీయ నిర్ణయం కాదని, దీనిపై ఏకపక్ష నిర్ణయం తీసుకోవటం సరైన విధానం కాదన్నారు. జాతీయ బి.సి. కమిషన్‌కు రాజ్యాంగ బద్ధ హోదా కల్పించటం పట్ల ప్రధాని మోదీకి ఆయన అభినందనలు తెలిపారు. బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, ఈడే మురళీకృష్ణ, అంగిరేకుల ఆదిశేషు, కుమ్మర క్రాంతి కుమార్, మారగాని నాగేశ్వరరావు, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆ గంటే కీలకం

వద్దు కాలహరణం

కృష్ణాజిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో ఇటీవల ఒకే రోజులో 24 మంది పాము కాటుకు గురయ్యారు. ఆ ఘటన అధికార యంత్రాంగాన్ని కలవరపెట్టింది. 24 గంటల వ్యవధిలో 24 మంది బాధితులు సకాలంలో అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రిలో చేరి మృత్యువు నుంచి బయటపడ్డారు. వ్యవసాయ పనుల సమయాల్లో సాధారణంగా ఈ ఆస్పత్రికి సగటున పది పాము కాటు కేసులు వస్తుంటాయి. రెండు జిల్లాల్లోని డెల్టా ప్రాంతాలైన ఉయ్యూరు, గుడివాడ, కైకలూరు, బందరు, అవనిగడ్డ, తెనాలి, బాపట్ల, పొన్నూరు, రేపల్లె తదితర ప్రాంతాల్లో సేద్యం సంవత్సరం పొడవునా సాగుతుంది. ఆ ప్రాంతాల్లో పచ్చదనంతో పాటు బురద ఎక్కువగా ఉన్నందున పాము కాటు బాధితులు అధికంగా ఆసుపత్రులకు వస్తున్నారు. ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాలకు ఏటా ఆగస్టు నుంచి డిసెంబరు వరకు రోజుకు ఐదారు కేసులు నమోదవుతున్నాయి. మరికొందరు గ్రామీణ ప్రాంతాల్లో నాటు వైద్యం చేయించుకొని ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో పాము కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రాథమిక వైద్యం తదితర అంశాలతో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఈనాడు-గుంటూరు, న్యూస్‌టుడే-నాగాయలంక

రెండు జిల్లాల్లో డెల్టా ప్రాంతం విస్తారంగా ఉంది. ఆ భూముల్లో వరి సాగుచేసేటప్పుడు ఎలుకలు విపరీతంగా సంచరిస్తాయి. వాటిని తినటానికి పాములు సైతం పొలాల్లోకి వస్తాయి. కేవలం ఎలుకల కోసమే అవి పొలాల్లో బాగా సంచరిస్తాయని జంతుశాస్త్ర అధ్యాపకులు సూచిస్తున్నారు. సాధారణంగా మనకు కనిపించే పాముల్లో అన్నీ విషపూరితమైనవి కావు. కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో ఎక్కువగా మరణాలకు కారణమయ్యే వాటిల్లో తాచు, కట్ల, రక్తపింజెర, హంప్ నోస్డ్ పిట్ వైపర్, గుమ్మడిత్తుల పింజెర ఎక్కువుగా ఉంటున్నాయి. వాటిని విషసర్పాలుగా గుర్తించారు. నల్లతాచులో అత్యధిక విషం ఉంటుంది. ఈది చాలా భయానకమని చెబుతున్నారు. ఆతర్వాతి స్థానం రక్తపింజెరది. ప్రజలంతా అత్యధికంగా భయటపడే తాచుపాము ప్రభావం మూడో స్థానంలో ఉంది.

రెండు జిల్లాల్లో ఆందోళన కలిగిస్తున్న పాముకాట్లు

నాటు వైద్యం వద్దంటున్న నిపుణులు

ఈ సందర్భాల్లో జాగ్రత్తలు తప్పనిసరి



సాధారణంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగే సమయాల్లోనే పాము కాటుకు గురవుతారు.

మెట్ట పొలాల్లో కలుపు తీతలు, చెరకులో జడలు కట్టే సమయంలో వరి ఓదెలను తిరగవేసేటప్పుడు, నారు పొలంలోకి తీసుకువెళ్లేటప్పుడు, మినుము ఓదెలను తిరగవేసే సందర్భాల్లో

తూర్పు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని తెనాలి, బాపట్ల, రేపల్లె ప్రాంతంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరినాట్లు ముమ్మరంగా జరుగుతాయి.

నవంబరు, డిసెంబరులో కోత కోసిన వరి ఓదెలు తిరగేసే సమయాల్లో ఇక్కడ పాముకాట్లు అత్యధికంగా నమోదవుతుంటాయి.



పాముకాటుకు గురై వైద్యం పొందుతున్న వ్యక్తికి కృత్రిమ శ్వాస అందిస్తున్న దృశ్యం

మందు అందుబాటులో ఉంది

అన్ని పీహెచ్‌సీల్లోనూ యాంటీ స్నేక్ వీనమ్ అందుబాటులో ఉంది. ఎవరైనా వ్యక్తి పాముకాటు కారణంగా మృతి చెందితే ప్రభుత్వం వారికి సాయాన్ని అందిస్తోంది. ఇందు కోసం ఎఫ్ఐఆర్ నమోదు చేయించటంతో పాటు శవపరీక్ష తప్పనిసరి. అయితే పాముకాటుకు గురైన వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి తీసుకువస్తే ప్రాణాన్ని కాపాడవచ్చు.

- టీవీఎస్ఎన్ శాస్త్రి, డీఎంఅండ్ హెచ్‌వో, కృష్ణా జిల్లా

ఇలా చేయొద్దు..

సినిమాలో చూపించిన మాదిరిగా పాము కరిచిన చోట నోటితో విషాన్ని పీల్చి ఉమ్మి వేయటం అత్యంత ప్రమాదకరం. దీని కారణంగా పాము కాటుకు గురైన వ్యక్తితో పాటు ఏ మాత్రమైనా నోట్లో చిన్న గాయం ఉంటే అలా చేసిన వ్యక్తి సైతం విష ప్రభావానికి గురవుతుంటారు.



కొందరు పాముకాటు జరిగిన చోట కొంత కండను కోసి తీసివేయటం చేస్తుంటారు. ఇది అదనపు ప్రమాదం తెచ్చి పెట్టేదే గానీ ఏమాత్రం ఉపయోగం ఉండదని గుర్తించాలి.

ఆసుపత్రికి వెళ్లిన వెంటనే యాంటీ స్నేక్ వీనమ్ ఇవ్వాలని ఒత్తిడి చేయకుండా వైద్యుడు పరిశీలించి అవసరమైతేనే యాంటీ స్నేక్ వీనమ్ ఇచ్చేలా సహకరించాలి. అనవసరమైన సందర్భాల్లో యాంటీ స్నేక్ వీనమ్ ఇవ్వటం ద్వారా మరొకరి ప్రాణాన్ని కాపాడే అమృతతుల్యమైన మందును దుర్వినియోగం చేసినట్లేననే విషయాన్ని గుర్తించాలి.

సాధారణంగా ధనుర్వాతం రాకుండా టెట్వాక్ ఇంజెక్షన్ ఇచ్చి సెలైన్ పెట్టటం ద్వారానే అత్యధిక పాముకాటు బాధితులు 24 గంటల పరిశీలన అనంతరం ఆసుపత్రి నుంచి వెళ్లిపోయే అవకాశం ఉంటుంది. విష లక్షణాలు ఉంటే మాత్రమే అవసరాన్ని బట్టి 5 నుంచి 30 వరకు యాంటీ స్నేక్ వీనమ్ డోస్‌లను రోగికి ఇవ్వాల్సి ఉంటుంది కాబట్టి ఎప్పుడూ పీహెచ్‌సీల్లో 10 డోస్‌లకు తగ్గకుండా యాంటీ స్నేక్ వీనమ్ డోస్‌లు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రజలు భయపడాల్సిన పనిలేదు

పాము కాటు మందు అన్ని పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంది. ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. ఎక్కడైనా అందుబాటులో లేకపోయినా వెంటనే పక్కన ఉండే పీహెచ్‌సీ నుంచి సర్దుబాటు చేసుకొని విషం విరుగుడు మందు అందు బాటులో ఉంచుకోవాలని ఇప్పటికే వైద్యులను అప్రమత్తం చేశాం. పాము కరిస్తే గంటలోపు ఆసుపత్రులకు చేరుకోవాలి.

-డాక్టర్ టి.రమేష్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, గుంటూరు

అవగాహన.. అప్రమత్తతతో..



రెండు జిల్లాల్లో పాముకాటు బాధితులు ఎక్కువే. కేవలం గతేడాది ఒక్క కృష్ణాజిల్లాలోనే వెయ్యికి పైగా కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లాలో 562 కేసులు వచ్చాయి. పొలాల్లోకి వెళ్లేటప్పుడు కచ్చితంగా అనుక్షణం చప్పుడు చేసుకుంటూ వెళ్లాలని.. ఈరకమైన చర్యలతోనే పాము కాటు నుంచి బయటపడగలరని నిపుణులు సూచిస్తున్నారు.

పాము కరవగానే ఏదో జరిగిపోయిందని, చనిపోతామనే భావన నుంచి తొలుత బయటపడాలి. ప్రతి ఒక్కరికీ విషసర్పాల గురించి అవగాహన కలిగి ఉండాలి.

పాము కరిచిన చోట తొలుత శుభ్రం చేయాలి. రక్త ప్రసరణ జరగకుండా గుడ్డతో కట్టాలి. ఈ గుడ్డను ఒకేచోట కాకుండా ప్రతి 15 నిమిషాలకు ఒకసారి దాన్ని మార్చి మరో చోట కట్టాలి.

ఏ పాము కరిచిందో దాని లక్షణాలేమిటో కూడా కొంత వరకు గుర్తించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

రక్తపింజెరి కాటు వేసిన సందర్భాల్లో చిగుళ్ల నుంచి, మూత్ర పిండాల నుంచి రక్తస్రావం అవుతుంది.

కట్లపాము కరిచిన సందర్భాల్లో బాధితుని కళ్లు మూతలు పడిపోతూ ఉండటాన్ని లక్షణాలుగా గుర్తించవచ్చు.

కృష్ణా జిల్లాలో..

సంవత్సరం	బాధితులు
2014	1143
2015	2033
2016	2046
2017(ఇంతవరకూ)	1100

గుంటూరు జిల్లాలో..

2015-16	502
2016-17	178
2017-18 ఇప్పటి దాకా	45

గమనిక: ఆసుపత్రులకు వచ్చిన బాధితులకు ప్రాణాపాయం తప్పింది

ఇవి నమ్మొద్దు..

పాము కరవగానే చాలా మంది చింతపండు పిచికారీ చేసి తాగమంటారు. అది సరికాదు.

ఊళ్లో ఉండే నాటు వైద్యులను, మంత్రగాళ్లను సంప్రదించి విలువైన కాలాన్ని వృథా చేస్తారు. ఈ జాప్యం కారణంగా విషం అతని శరీరంలోకి ప్రవేశిస్తుంది.

ఇవన్నీ మూఢనమ్మకాలుగా భావించి వాటిని విడనాడాలి.

ఆస్పత్రుల్లో మందులు..



విష సర్పాల కాటులో 30 నుంచి 40 శాతం మేర విషం ఎక్కని ప్రమాదరహిత కాట్లే (డ్రై బైట్స్) ఉంటాయి. కానీ పాము కాటు కారణంగా మనిషి శరీరంలోకి విషం ఎక్కితే కేవలం యాంటీ స్నేక్ వీనమ్‌తో తప్ప మరే ఇతర వైద్యం వల్ల వ్యక్తి బతికిన సందర్భాలు ఉండవు. రెండు జిల్లాల్లో అన్ని ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు, బోధనాసుపత్రులకు ఈ సీజన్‌లో ప్రభుత్వం ఎక్కువుగా 'యాంటీ స్నేక్ వీనం' అను సూది మందును పంపుతుంది. ఏపాము కరిచిందో అతనికి ఉన్న లక్షణాలను బట్టి వైద్యులు గుర్తించి బాధితుడికి వైద్యసేవలు అందిస్తారు. పాము కరిచి ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికీ యాంటీ స్నేక్ వీనం మందు ఇవ్వరు. విషంలేని పాములు కరిచిన వారికి వేరేమందులు ఇస్తారు. కరిచిన పామును బట్టి శరీరంలోకి ప్రవేశించిన విష మోతాదును బట్టి కనీసంగా ఐదు డోసుల యాంటీ స్నేక్ వీనమ్‌ను శరీరంలోకి నరాల ద్వారా ఎక్కిస్తారు.

అవగాహన కల్పించాలి..



పాము కాటుకు సంబంధించి ప్రభుత్వం అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలి. ఇప్పటికీ గ్రామాల్లో అనేక మంది మూఢనమ్మకాల బారిన పడి సకాలంలో ఆసుపత్రులకు వెళ్లక ప్రాణాపాయం తెచ్చుకుంటున్నారు. దీన్ని గుర్తించి ప్రభుత్వమే ఈ సీజన్‌లో వైద్యాధికారుల ద్వారా ప్రచారం చేయించాలి. వచ్చిన ప్రతి పాము కాటు బాధితునికి ఒకటో, రెండు డోస్‌లు ఇవ్వటం కాకుండా కేవలం అవసరమైన వారికి మాత్రమే వారి అవసరాన్ని బట్టి 5 నుంచి 10 డోసుల యాంటీ స్నేక్ వీనమ్ డోస్‌ను ఇవ్వాల్సి ఉంటుంది. కానీ రాజకీయ నేతలో, పలుకుబడి కలవారో తమ పలుకుబడిని ఉపయోగించి అవసరం లేని వారికి కూడా యాంటీ స్నేక్ వీనమ్ ఇవ్వాలని ఒత్తిడి తెస్తుంటారు. ఇది సరి కాదు. ఏ మేరకు మందు ఇవ్వాలో వైద్యులకు తెలుస్తుంది. నేతలు ఇష్టానుసారం ఒత్తిడి తేవటం మంచిది కాదు.

-డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, పాము కాటు వైద్య నిపుణుడు



తాచుపాము: తాచుపాము విషాన్ని న్యూరో టాక్సిన్ అని అంటారు. ఈ విషం నరాలు, కండరాల మీద ప్రభావాన్ని చూపుతుంది. బాధితునికి ముందుగా కళ్లు మూతలు పడిపోవటం, కళ్లు తెరిచేందుకు ప్రయత్నించే సందర్భాల్లో భృకుటి ముడిపడుతుందే గానీ కనురెప్పలు సరిగ్గా తెరవలేని పరిస్థితి ఉంటుంది. కొంతసేపటికే వాంతులు అవుతాయి. కొన్ని సందర్భాల్లో బాధితుడు కాళ్లు, చేతులు కొట్టుకుంటారు. కొన్ని సందర్భాల్లో పాము కాటేసిన కొద్దిసేపటికే శ్వాస, కండరాల పనితీరు నెమ్మదించి మరి కొంతసేపటికి ఊపిరి ఆగిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. అయినప్పటికీ వ్యక్తి మృతి చెందాడని నిర్ధరణకు రాకుండా కృత్రిమ శ్వాస అందిస్తూ యాంటీ స్నేక్ వీనమ్‌ను ఎక్కించటం ద్వారా బతికించవచ్చు.



కట్లపాము: దేశంలో కనిపించే అత్యంత ప్రభావశీలమైన విషం గల పాము ఇది. దీని విషంలోనూ న్యూరోటాక్సినే ఉంటుంది. ఈ పాము కాటేసేవారికి తీవ్రమైన మగత, నీరసం, తూలు వస్తాయి. ఇవి ఎక్కువగా పూరిగుడిసెల్లో, తాటాకు, రెల్లుగడ్డి ఇళ్ల లోపలి భాగపు పైకప్పుల్లో సంచరిస్తుంటాయి. దూలాలపై నిర్మించే పెంకుటిళ్లు, రేకుల ఇళ్లల్లో కూడా పైభాగంలో సంచరిస్తూ అప్పుడప్పుడు జారి పడిపోయిన సందర్భాల్లో కింద నిద్రిస్తున్న వ్యక్తిని కాటేస్తుంటాయి. అలా నిద్రలో జరిగిన కాటును గుర్తించని వారు షుగర్ స్థాయి తగ్గిపోయిందని భావించి నోట్లో పంచదార వేసుకొని కొద్దిసేపు వేచి చూసిన తర్వాత గానీ వైద్యుని వద్దకు వెళ్లరు. ఈ పాముకాటుకు 5 నుంచి 10 వరకు యాంటీ స్నేక్ వీనమ్‌ను ఇవ్వాల్సి ఉంటుంది.



రక్తపింజెరి: అత్యధిక మరణాలు సంభవించే కాట్లలో రక్తపింజెరి కాటును ప్రధానంగా చెప్పుకోవచ్చు. కృష్ణాజిల్లా పరిధిలోని చల్లపల్లి, మోపిదేవి, తోట్లవల్లూరు, తదితర లంకగ్రామాల్లో అత్యధికంగా వీటి సంచారం కనిపిస్తుంటుంది. ఏ భాగంలో అయితే కాటు పడి విషం ఎక్కుతుందో ఆభాగం వద్ద తీవ్రమైన వాపు ఏర్పడుతుంది. ఆ భాగానికి దగ్గరలో లింప్ గ్రంథులు సైతం తీవ్రంగా వాస్తాయి. గజ్జల్లోనూ, చంకల్లోనూ బిళ్లలు కట్టి భరించలేనంతగా నొప్పి వస్తుంది. కొద్దిసేపటికే శరీరంలోని ఏదో ఒక భాగం నుంచి రక్తస్రావం అవుతుంది. మెదడులో రక్తస్రావం జరిగే సందర్భాల్లో పాముకాటుకు గురైన వ్యక్తి కోమాలోకి వెళ్లే ప్రమాదం ఏర్పడుతుంది. దీని కాటుకు గురైన వ్యక్తి రెండుమూడు వారాలపాటు వైద్యుని పర్యవేక్షణలో ఉండాలి.

కళాంజలిలో సరికొత్త డిజైన్లు



ఈనాడు, హైదరాబాద్

కళాంజలిలో వృషభ కలెక్షన్లో సరికొత్త డిజైన్లు వచ్చాయి. సంప్రదాయానికి ఆధునిక మేళవింపుతో రూపొందించిన కాటన్ హ్యాండ్‌ప్రింట్ వస్త్రాలు ఏ సందర్భంలోనైనా మగువలు ధరించేందుకు అనువుగా ఉన్నాయి.

ముదురు నీలం రంగు చీర.. నారింజ రంగు అంచు.. చీర అంతటా వృషభాల మోటిఫ్స్‌తో పాటూ పల్లుతో మరింత అందం వచ్చింది.

బ్లాక్ ప్రింటెడ్ డిజైనర్ నీలం రంగు సికో చీర వృషభాల మోటిఫ్స్‌తో చూడచక్కగా ఉంది.

బీసీల కోసం నవంబరులో కొత్త పార్టీ

ఆంధ్రప్రదేశ్ బ్యాక్‌వర్డ్ క్లాస్ సంఘం ప్రకటన

సూర్యారావుపేట (విజయవాడ), న్యూస్‌టుడే: వెనుకబడిన తరగతుల వారు అభివృద్ధి చెందాలంటే ప్రస్తుతం ఉన్న రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయ పార్టీ రావాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ బ్యాక్‌వర్డ్ క్లాస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డేరంగుల ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం సూర్యారావుపేట కాళేశ్వరరావురోడ్డులోని ఒక హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ బ్యాక్‌వర్డ్ క్లాస్ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీలు 60 శాతం పైబడి ఉన్నా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికీ ఇది అమలుకు నోచుకోవటం లేదన్నారు. అన్ని రాజకీయపార్టీలు బీసీల ఓట్లతో గెలుపొంది వారిని పావులుగా వినియోగించుకుంటున్నారని వారిని అణగదొక్కుతున్నారన్నారు. బీసీల సత్తా చూపేందుకు పేదల కోసం కొత్త పార్టీని ఏర్పాటు చేస్తున్నామని దీనిపై నవంబరు నెలలో విధి విధానాలు, పార్టీ పేరు విడుదల చేస్తామని తెలిపారు. బీసీల ద్రోహి ఆర్.కృష్ణయ్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీల హక్కులను కాలరాస్తున్న తెలంగాణకు చెందిన కృష్ణయ్య ఏపీలో అడుగు పెట్టే అర్హత కోల్పోయారని ఎద్దేవా చేశారు. బీసీల పార్టీ పెడతానంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని బీసీల సంఘం పెట్టి చంద్రబాబుకు తాకట్టు పెట్టిన కృష్ణయ్య రేపు పార్టీని కూడా అలాగే చేస్తారని విమర్శించారు. బీసీల భవిష్యత్తు కోసం, బీసీల తలరాత మార్చే పార్టీ ఏర్పాటు చేస్తామని ఉదయ్‌కిరణ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి తమ్మిశెట్టి చక్రవర్తి, ఏడీ రామాచార్యులు, బత్తుల లక్ష్మీకాంతయ్య, శ్యాంసుందరరావు, లీలాకృష్ణ, ధనలక్ష్మి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డేరంగుల ఉదయ్‌కిరణ్ తదితరులు

నాణ్యత పాటించకపోతే చర్యలు: ఏడీఆర్‌ఎం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికులకు సరఫరా చేసే ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని విజయవాడ ఏడీఆర్‌ఎం వేణుగోపాలరావు రైల్వేస్టేషన్‌లో క్యాంటీన్, స్టాళ్ల నిర్వాహకులను హెచ్చరించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. అన్ని ప్లాట్‌ఫారాల్లో మంచినీటి కుళాయిలను పరిశీలించి రోజూ నమూనాలను పరీక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు క్యాంటీన్లను పరిశీలించి ఆహారపదార్థాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రైల్వే డివిజనల్ ఇంజినీర్ వరుణ్‌బాబు, చీఫ్ ఇంజనీర్ పి.ఆర్.సురేష్, సీనియర్ డీఈఎన్ ఎస్.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంచినీటిని పరిశీలిస్తున్న ఏడీఆర్‌ఎం వేణుగోపాలరావు, ఇతర అధికారులు

మోసపోయిన సచివాలయ ఉన్నతాధికారి

పెనమలూరు, న్యూస్‌టుడే : సైబర్ మోసగాళ్ల బాధితుల జాబితాలో రాష్ట్ర సచివాలయ ఐటీ విభాగం ఉన్నతాధికారి చేరిపోయారు. అతని ఖాతా నుంచి ఏకంగా విదేశీ నగదు యూరోల రూపంలో దాదాపు 80 వేల వరకు మోసగాళ్లు లాగేయడంతో బాధితుడు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పూసపాటి వేణుగోపాల్ కానూరు సిరినగర్ సమీపంలోని తులసీనగర్‌లో నివసిస్తుంటారు. అతను రాష్ట్ర సచివాలయంలో ఐటీ విభాగం ఉన్నతాధికారిగా పనిచేస్తున్నారు. అతనికి యాక్సిస్ బ్యాంకులో ఖాతాతోపాటు క్రెడిట్ కార్డు కూడా ఉంది. ఈనెల 24న వేణుగోపాల్ సెల్‌ఫోన్‌కు ఓ సంక్షిప్త సందేశం వచ్చింది. అతని క్రెడిట్ కార్డు ఖాతా నుంచి యూరోల రూపంలో 1110 యూరోలు (దాదాపు రూ.80వేలు) తన ప్రమేయం లేకుండా డ్రా అయినట్లు గుర్తించారు. వెంటనే బ్యాంకు అధికారులకు సమాచారం అందించి ఖాతాను స్తంభింపజేశారు. ఈ మేరకు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఖాతా నుంచి ఈ నగదు రుంబోమర్చంట్ అనే సంస్థ ఖాతాకు మళ్లినట్లు, ఈ సంస్థ స్పెయిన్‌లో ఉన్నట్లు పోలీసులు ఆరా తీయగా తేలింది.

విద్యార్థినిని వేధిస్తున్న ముగ్గురిపై కేసు

యనమలకుదురు(పెనమలూరు), న్యూస్‌టుడే: తొమ్మిదో తరగతి విద్యార్థినిని వేధిస్తున్న ఇద్దరు యువకులతోపాటు అందుకు వత్తాసుపలుకుతున్న వారి తండ్రిపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు అంబేడ్కర్‌నగర్ ప్రాంతంలో నివసించే ఓబాలిక నగరంలోని ఓ పాఠశాలలో తొమ్మితో తరగతి చదువుతోంది. ఈమె పాఠశాలకు వెళ్లి వచ్చే సమయంలో అదే గ్రామానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు ఆమె వెనుక వస్తూ పాటలు పాడడం, అసభ్యంగా మాట్లాడడం చేస్తున్నారు. వీరి వేధింపులు భరించలేని ఆమె పాఠశాలకు వెళ్లడం కొన్నాళ్లగా మానేసింది. ఈ విషయాన్ని కుటుంబ పెద్దలకు తెలుపగా ఆమె తండ్రి.. వేధిస్తున్న ఇద్దరు అన్నదమ్ములను ప్రశ్నించడంతో వివాదం జరిగింది. అన్నదమ్ములతో పాటు వారి తండ్రి శ్రీను ఆ బాలిక తండ్రిని బెదిరించడంతో ఆదివారం అతను పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఇద్దరు అన్నదమ్ములతోపాటు వారి తండ్రి శ్రీను పైనా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ లారీ స్వాధీనం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కానూరు నుంచి శ్రీకాకుళం వెళ్లాల్సిన పామాయిల్ లోడు రూటు మారి జగ్గయ్యపేటకు వెళ్తున్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం రింగు సెంటర్ వద్ద పోలీసులు వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఇబ్రహీంపట్నం రింగు సెంటర్ వద్ద విధుల్లో ఉన్న పోలీసులు వేగంగా వెళ్తున్న వాహనాన్ని గమనించి ఆపమన్నారు. డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ముందుకు పోనిచ్చాడు. వెంటనే ఆ వాహనాన్ని వెంబడించిన పోలీసులు దగ్గరలోనే ఆపి అందులో సరకును పరిశీలించారు. డ్రైవర్‌ని ప్రశ్నించగా నెయ్యిని జగ్గయ్యపేట తీసుకెళ్తున్నామని సమాధానమిచ్చాడు. బిల్లులో మాత్రం వివరాలు మరోలా ఉన్నాయి. 5280 కేజీల పామాయిల్ కానూరు నుంచి శ్రీకాకుళం వెళ్తున్నట్లు కంప్యూటర్ బిల్లు ఉంది. నెయ్యిని జగ్గయ్యపేట తరలిస్తున్నామని డ్రైవర్ చెప్పడం.. బిల్లులో మాత్రం పామాయిల్ అని ఉండటంతో అనుమానం వచ్చిన పోలీసులు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆహార భద్రత అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం సాయంత్రం వారు వచ్చి వాహనంతో పాటు అందులోని సరకును స్వాధీనం చేసుకున్నారు. సరకును పరీక్షించిన అనంతరం ఆధారాలతో కేసు నమోదు చేస్తామని సీఐ చవాన్ తెలిపారు.



క్యానులో పదార్థం

A.P.PRODUCTIVITY COUNCIL
2nd Floor, 'C', Maalika Apartments, M.G.Road, Vijayawada-10. Ph : 2476748

ADMISSION NOTIFICATION 2017-18

P.G.DIPLOMA COURSES (Part-Time/Distance)
1. Personnel Management IR & LW (IRPM)
2. Materials Management
3. Environmental, Health & Safety Management
4. Energy & Environmental Management
5. Logistic & Supply Chain Management
6. Rural Development
7. Human Resource Development

Application & Prospectus can be obtained by paying Rs.100/- either in cash or D.D. in favour of APPC, Vijayawada with Rs.15/- self addressed stamped envelop. Last Date:15-9-2017

Eligibility: any Degree. Duration: 1 year

For Admission details contact : 9908035221

గృహ నిర్మాణాల ప్రగతిపై రోజూ సమీక్ష: కలెక్టరు

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: గృహ నిర్మాణాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, వీటిపై తాను రోజూ సమీక్షించనున్నట్లు కలెక్టరు బి.లక్ష్మీకాంతం పేర్కొన్నారు. నగరంలోని తమ విడిది కార్యాలయంలో గృహ నిర్మాణ, వ్యవసాయ శాఖల అధికారులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కలెక్టరు మాట్లాడారు. ఇప్పటికే గృహాలు మంజూరై, ఇంకా నిర్మాణాలను చేపట్టని లబ్ధిదారులకు అవగాహన కల్పించి, పనులను ప్రారంభించేలా చూడాలని కోరారు. వ్యవసాయ శాఖపై నిర్వహించిన సమీక్షలో ఇంకా వరి నాట్లు పూర్తి కాని ప్రాంతాల్లో సత్వరమే పూర్తయ్యేలా వ్యవసాయాధికారులు కృషి చేయాలన్నారు. కాల్వల చివరి భూములకు సాగునీటిని అందిస్తున్న క్రమంలో రైతులను అప్రమత్తం చేసి, నాట్లు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఇ-క్రాపు నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ శరత్‌బాబు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు లక్ష్మీకాంతం

చిన్నారిపై అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

పెనమలూరు, న్యూస్‌టుడే: చిన్నారిపై అత్యాచారానికి ఒడిగట్టిన కేసులో నిందితుడిని పెనమలూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా నుంచి బతుకుదెరువు కోసం పోరంకిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పనికి వచ్చిన ఓ కుటుంబానికి చెందిన చిన్నారిపై అదేచోట పనిచేస్తున్న రోబిన్‌బిస్వాస్ అనే యువకుడు రెండ్రోజుల క్రితం అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ కేసులో అతనిని సీఐ దామోదర్ ఆదివారం అరెస్టు చేశారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒకటి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 84, లైవ్ ధర - 99, చికెన్ విత్ స్కిన్ -139, చికెన్ స్కిన్‌లెస్ - 163
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం ధర - 91, 99, 110 చికెన్ విత్ స్కిన్- 176, చికెన్ స్కిన్‌లెస్- 186

నెక్ కోడిగ్రుడ్ల ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.59 పైసలు. నెక్ విజయవాడ ఆఫీస్ Ph: 0866 - 6582559.

గన్నవరం

సేవాగుణం అలవరచుకోవాలి

గన్నవరం, న్యూస్‌టుడే : మదర్ థెరిసా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవరచుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు అన్నారు. స్థానిక మదర్ థెరిసా కాలనీలో ఆదివారం మదర్ థెరిసా ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అభాగ్యులకు విశేష సేవలందిస్తూ దేశవ్యాప్తంగా కీర్తి గడించిన మదర్ థెరిసా రేపటి తరానికి ఆదర్శమని అన్నారు. కేకు కోసి అందరికీ పంచారు. ట్రస్టు అధ్యక్షులు కృష్ణ ఆధ్వర్యంలో 75 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఎంపీపీ పట్రా కవిత, జడ్పీటీసీ మరీదు లక్ష్మీదుర్గ, సర్పంచి నీలం ప్రవీణ్‌కుమార్, మండల తెదేపా అధ్యక్షులు పటమట సురేష్, పట్టణ అధ్యక్షులు పాలడుగు నాని తదితరులు పాల్గొన్నారు.



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న అతిథులు

సినిమాలు

శ్రీవెంకటేశ్వర - వివేకం

శాంతి - జయ జానకి నాయక

గ్యాస్ సమాచారం

గన్నవరం హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో ఈ నెల 27వ తేదీ వరకు నమోదు చేసుకున్న వారికి 28వ తేదీన గ్యాస్ సరఫరా చేస్తారు. ఆన్‌లైన్ విధానంలో నమోదు చేసుకునే వారు 96660 23456కు ఫోన్ చేయాలి.

ఫోకస్

జర భద్రం..

దారులన్నీ ఛిద్రం

గోతుల మయం.. ప్రధాన మార్గాలు

రాకపోకలకు తీవ్ర అగచాట్లు



వేలేరు రహదారి దుస్థితి



రేమల్లె పంచాయతీ కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారి ఇలా..



రేమల్లెలో పోలవరం కాల్వ వంతెన వద్ద..

బాపులపాడు మండలంలోని పలు గ్రామాల ప్రధాన రహదారుల పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. చిన్నపాటి వర్షాలకే ఇవన్నీ ఛిద్రమైపోయాయి. ఎక్కడికక్కడ గోతులతో ఉన్న వీటిపై రాకపోకలు సాగించడం నరకప్రాయంగా మారింది. వర్షపు నీటికి మడుగులుగా మారుతున్నాయి. ఎక్కడ గుంత ఉందో తెలియక ద్విచక్ర వాహనదార్లు నానా పాట్లు పడుతున్నారు. మండలాలు, నియోజకవర్గాలను అనుసంధానం చేసే అత్యంత కీలకమైన ఈ రహదారులు ఇంతలా దెబ్బతిన్నా.. ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్ గ్రామీణం



వీరవల్లి రైల్వేస్టేషన్ వద్ద రంగన్నగూడెం వెళ్లే రహదారి దుస్థితి

బాలిక వైద్య ఖర్చులకు చేయూత

హనుమాన్‌జంక్షన్ గ్రామీణం, న్యూస్‌టుడే : అనారోగ్యంతో బాధపడుతున్న ఓ బాలికకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.60 లక్షల ఆర్థిక సాయం మంజూరైంది. బాపులపాడులోని హనుమాన్‌నగర్‌కు చెందిన రంగిశెట్టి సురేష్ కుమార్తె స్వప్న గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. చికిత్స కోసం విజయవాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రికు వెళ్లగా శస్త్రచికిత్స చేయాలని, దీనికి భారీగా ఖర్చువుతుందని చెప్పారు. ఆర్థిక స్థోమత లేని ఈమె తండ్రి స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే వల్లభనేని వంశీని ఆశ్రయించారు. స్పందించిన ఆయన.. సీఎం సహాయ నిధి నుంచి ఎల్వోసీ మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన ధ్రువ పత్రాలను శనివారం కానుమోలులో వంశీ సమక్షంలో అందజేశారు. తెదేపా మండల కార్యదర్శి చెన్నుబోయిన శివయ్య, తెదేపా గ్రామ నాయకులు కొల్లి వెంకట్రావు, కట్టా వాసు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి చీరల వేలం



చీరల వేలం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

రామవరప్పాడు (గన్నవరం), న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం రామవరప్పాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీవెంకమ్మ పేరంటాళ్ల అమ్మవారి ఆలయంలో ఆదివారం అమ్మవారి చీరలను వేలం వేశారు. అమ్మవార్లకు భక్తులు సమర్పించిన మొత్తం 215 చీరలను వేలం వేయగా.. రూ.35,490 ఆదాయం వచ్చింది. ఆలయ కార్యనిర్వాహక అధికారి భానోజీరావు, ఇతర అధికారులు, పెద్దలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మారుతీనగర్ (విజయవాడ, న్యూస్‌టుడే): లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మారుతీనగర్‌లోని క్లబ్ భవనంలో ఉచిత వైద్య శిబిరం, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా గవర్నరు వీవీ సాయివరప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అవగాహన సదస్సులో రమేష్ ఆసుపత్రి నరాల వైద్యుడు సీహెచ్ మురళి ముఖ్యవక్తగా హాజరై మాట్లాడుతూ అధిక బరువు, అధిక రక్తపోటు, ఆహారపు అలవాట్లతో పాటు వారసత్వంగా కూడా కొన్ని జబ్బులు వస్తాయన్నారు. అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు.

జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

గన్నవరం, న్యూస్‌టుడే : మత్స్యకార వృత్తిదారులంతా కష్టపడి తమతమ కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ సూచించారు. గన్నవరం మత్స్యకార సహకార సంఘం ఎన్నికలు ఆదివారం స్థానిక ఎస్సీకాలనీలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడిగా బత్తుల సురేష్, ఉపాధ్యక్షులుగా కాటుమాల కాంతారావు, కార్యదర్శిగా సటి జీవరత్నం పలువురిని సభ్యులుగా ఎంపికచేశారు. స్థానిక నియోజకవర్గ తెదేపా కార్యాలయంలో వంశీని కలిసిన నూతన కమిటీ సభ్యులకు ఆయన పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పేద వర్గాల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, రాయితీ రుణాలు అందజేస్తోందని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని హితవు పలికారు. ఏఎంసీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు, ఎంపీపీ పట్రా కవిత, జడ్పీటీసీ మరీదు లక్ష్మీదుర్గ, వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, తెదేపా మండల అధ్యక్షుడు పడమట సురేష్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పాలడుగు నాని, నాయకులు రాంబాబు, సుభాష్‌చంద్రబోసు తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే వంశీ తదితరులు

ఆనందం ఆహ్లాదం కావాలి

కేసరపల్లి (గన్నవరం), న్యూస్‌టుడే : వారాంతం విధులతో సతమతమయ్యే మనమంతా ఒక్కరోజు ఆనందం పొందటం ఆరోగ్యానికి మంచిదని ఎంపీపీ పట్రా కవిత, జడ్పీటీసీ మరీదు లక్ష్మీదుర్గ అన్నారు. మండలంలోని కేసరపల్లిలో పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం ఆనంద ఆదివారం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ.. ఆదివారం సరదాగా గడపటానికి ప్రతిఒక్కరూ ప్రయత్నించాలని సూచించారు. ఏఎంసీ ఛైర్మన్ షటిల్ ఆడి పోటీలు ప్రారంభించారు. కేసరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనలతో అలరించారు. సర్పంచి కాలగడ్డ శివనాగరాజకుమారి అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి తక్కువ మంది ప్రజలు హాజరయ్యారు. కలెక్టరు లక్ష్మీకాంతం వస్తారని సమాచారం వచ్చినా... ఆఖరికి ఆయన రాలేదు. నీటి సంఘం అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ కుమార్, ఎంపీడీవో వై.ఇందిరా ప్రియదర్శిని, ఎంఈవో మార్గరేట్, గ్రామకార్యదర్శి రావి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థుల నృత్యాలు

గన్నవరం

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

మధురానగర్ : దుర్గాపురం ఫీడర్‌లైన్ల మరమ్మతుల కారణంగా మధురానగర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మురళీమోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాంబమూర్తి రోడ్డు, గులాబీతోట, బీఆర్‌టీఎస్ రోడ్డు, భానునగర్, పున్నయ్యకాలనీ ప్రాంతాలకు విద్యుత్తు సరఫరా ఉండదని డీఈఈ తెలిపారు.

పూడిక తీశారు.. వదిలేశారు!

మూడు వారాలుగా ప్రక్రియ | **తరలింపు అంతంతమాత్రమే** | **బాపులపాడు పంచాయతీలో తీరని వెతలు**



ఆర్టీసీ బస్టాండ్ వద్ద పూడిక తీసిన మురుగు గుట్టగా పది రోజులుగా ఇలానే..



కాలిబాటపై ఉన్న రాళ్లు తీసి వదిలేయడంతో ప్రమాదకరంగా..



విజయవాడ రోడ్డులో మురుగు కాల్వలో దోమల లార్వా

హనుమాన్‌జంక్షన్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండల కేంద్రమైన బాపులపాడు గ్రామ పంచాయతీ పరిధిలో మురుగు కాల్వల ప్రక్షాళన మందకొడిగా సాగుతోంది. పంచాయతీరాజ్ శాఖ ఆదేశాలతో గ్రామంలో మూడు వారాల క్రితం జాతీయ రహదారి వెంబడి మురుగు కాల్వల పూడికతీత చేపట్టిన సంగతి తెల్సిందే. ఇందులో భాగంగా కాల్వల్లో తీసిన బురద మేటను రహదారులపై గుట్టలు గుట్టలుగా పోశారు. వీటి తొలగింపు, తరలింపులో అధికారులు అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో ఎక్కడివక్కడే అన్న రీతిలో పేరుకుపోయాయి. తడిగా ఉన్న మేటల్ని తొలగించడంలో ఇబ్బందులున్నాయంటూ చెప్పిన అధికారులు, పూర్తిగా ఎండిన తర్వాత కూడా వీటిని శుభ్రం చేసే పనిని సక్రమంగా చేయడంలేదు. ఇప్పటికీ జాతీయ రహదారి వెంబడి చాలాచోట్ల గుట్టలు అలాగే ఉండిపోయాయి. మరో వైపు కాలిబాట మార్గంలో ఉన్న రాళ్లను తొలగించి పూడిక తీసిన సిబ్బంది వాటిని పునరుద్ధరించలేదు. కాలిబాటపై రాకపోకలు సాగించడం ప్రమాదకరంగా మారింది. మరోవైపు వీటిఐ రాళ్లు లేకపోవడంతో దుర్గంధం, దోమల ధాటికి జనం విలవిల్లాడిపోతున్నారు. కూడలి వద్ద గుడివాడ రోడ్డు మలుపులో పూడికతీత చేపట్టేందుకు మురుగు కాల్వపై రాళ్లు తొలగించి అలాగే వదిలేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయంగా మారడంతో పాటు, సమీప దుకాణదార్లకు తీవ్ర ఇబ్బందిగా మారింది.



హనుమాన్‌జంక్షన్ కూడలి వద్ద తవ్వేసి వదిలేశారిలా..

సమానత్వ సాధనకు పోరాడండి

గన్నవరం, న్యూస్‌టుడే : చట్ట సభల్లో మహిళల సమానత్వ సాధనకు పార్లమెంటులో రిజర్వేషన్ చట్టాన్ని వెంటనే చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. గన్నవరం డివిజన్ ఐద్వా, సీపీఎం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షురాలు చిటికెల వెంకట లక్ష్మి అధ్యక్షత వహించారు. రమాదేవి ప్రసంగిస్తూ.. భాజపా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. భాజపా ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టడంలేదని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంలో కేంద్రాన్ని ప్రశ్నించటంలేదని విమర్శించారు. అందుకోసమే మహిళల ఉద్యమం గ్రామగ్రామానా మళ్లీ ప్రారంభం కావాలని కోరారు. సామాజిక కార్యకర్త ఎం.మాధవి మాట్లాడుతూ.. చదువులేకపోవటంతోనే నేటికీ మహిళల్లో చైతన్యం రావటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు అవుతున్నా దాస్య సృంకలాలు ఛేదించటం జరగలేదని పేర్కొన్నారు. సభలో ఐద్వా జిల్లా కార్యదర్శి పిన్నమనేని విజయ, అధ్యక్షురాలు ఎం.జయమ్మ, గన్నవరం డివిజన్ ఉపాధ్యక్షురాలు ఎస్.కమల తదితరులు ప్రసంగించారు.

నిమజ్జనం.. భద్రత శూన్యం

ఏలూరు కాల్వ వద్ద కానరాని ఏర్పాట్లు | **అనర్థాలకు ఆస్కారం**



రెండు విద్యుత్తు దీపాలు ఏర్పాటుతో సరి

పెరికీడు (హనుమాన్‌జంక్షన్ గ్రామీణం), న్యూస్‌టుడే : వినాయక చవితి పర్వదినం అనంతరం ఉత్సవాల్లో అత్యంత కీలకమైన ఘట్టం నిమజ్జనోత్సవం. కోలాహలంగా సాగే ఈ వేడుకలో గణనాథుని విగ్రహాలను భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి కాల్వల్లో, చెరువుల్లో నిమజ్జనం చేయడం ఆనవాయితీ. బాపులపాడు మండలంతో పాటు, పొరుగునే ఉన్న పెదపాడు, నూజివీడు మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన ఉత్సవ నిర్వాహకులు, పెరికీడు వద్ద ఏలూరు కాల్వలో నిమజ్జనం చేయడం దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయం. కానీ దీనికి వీలుగా ఇక్కడ ఏర్పాట్లు చేయడంలో అధికారులు ఈ ఏడాది కూడా తీవ్ర నిర్లక్ష్యమే చూపుతున్నారు. విగ్రహాలను దింపేందుకు ర్యాంపు గానీ, కాల్వలోకి తీసుకెళ్లేందుకు ఎంపిక చేసిన చోట బారికేడ్లు గానీ ఏర్పాటు చేయలేదు. గతంలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సంయుక్తంగా నిమజ్జనానికి వీలుగా ముందుగానే పరిశీలన జరిపి తగిన ఏర్పాట్లు చేపట్టేవారు. కానీ ఈసారి అలాంటి ప్రక్రియ జరగలేదు. శనివారం నుంచే వరుసగా నిమజ్జనాలు జరుగుతున్నాయి. మరో పదిరోజుల పాటు ఇవి కొనసాగనున్నాయి. దాదాపు వందకు పైగా విగ్రహాలను ఈ సారి నిమజ్జనం చేయవచ్చునని ఓ అంచనా. ఇవన్నీ దాదాపుగా రాత్రి వేళలోనే జరుగుతుంటాయి. కాల్వలో ప్రవాహం ఎక్కువగా ఉండటం, ఇందులో దిగేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడం ఆందోళన కల్గిస్తోంది. గతంలో పలుమార్లు యువకులు గల్లంతైన ఉదంతాలు ఉన్నాయి. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గణేష్ మహారాజ్‌కు జై..!



బాపులపాడులో వేలేరు రోడ్డులో వినాయక విగ్రహం



బాల గణేశుడ్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

హనుమాన్‌జంక్షన్ గ్రామీణం, న్యూస్‌టుడే : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం పలుచోట్ల కోలాహలం నెలకొంది. ఉత్సవ మండపాల్లో ప్రత్యేక వేడుకలు కొనసాగాయి. కొన్ని చోట్ల నిమజ్జనాల సందర్భంగా ఊరేగింపులు సందడిగా సాగాయి. పెరికీడులో అన్నదానం నిర్వహించారు. లడ్డూ వేలం పాట నిర్వహించగా రూ.6,700కు జెట్టి చలపతిరావు దక్కించుకున్నారు. పల్లపోతు ఓమయ్య, నక్కా పవన్, పుట్టి నాగరాజు, రాజులపాటి శ్రీను, మరీదు శివ, మాజీ సర్పంచి తవ్వా మూర్తి, పుట్టి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రమైన బాపులపాడు ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. హనుమాన్‌నగర్, వేలేరు అడ్డరోడ్డు, నూజివీడు రోడ్డు ఇందిరానగర్, గుడివాడరోడ్డు ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండివాని చెరువుగట్టుపై ఏర్పాటు చేసిన విగ్రహాన్ని కోలాహలంగా నిమజ్జనానికి తరలించారు.


ఉంగుటూరు, న్యూస్‌టుడే : మండలంలో వినాయక నిమజ్జనం కార్యక్రమాలు పలు గ్రామాల్లో కోలాహలంగా సాగాయి. తరిగొప్పల, చాగంటిపాడు, నాగవరపాడు, వేంపాడు, వెన్నూతల తదితర గ్రామాల్లో స్వామివారి విగ్రహాన్ని సమీప కాలువలోల్ల నిమజ్జనం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పెరికీడులో లడ్డూని పాటదారుడికి అందజేస్తున్న నిర్వాహకులు



ఆత్కూరు కోనేరు సెంటర్‌లో విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



పొట్టిపాడులో..

నిమజ్జనాల సందడి

కేసరపల్లి, దావాజిగూడెం, బుద్ధవరం (గన్నవరం), న్యూస్‌టుడే : మండల కేంద్రం గన్నవరం ప్రాంతంలో ఆదివారం వినాయక నిమజ్జన కార్యక్రమాల సందడి నెలకొంది. అలాగే కేసరపల్లిలోని ఏలూరు కాలువలో గూడవల్లి, కేసరపల్లి గ్రామాల గణ నాథులను ప్రదర్శనగా తీసుకువచ్చి నిమజ్జనం చేశారు. స్థానిక బుద్ధవరం రోడ్డులోని పశువైద్య కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన వినాయక మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. డప్పు వాయిద్యాలు తీన్‌మార్ మేళతాళాలతో ప్రదర్శనగా పట్టణంలో ఊరేగింపు నిర్వహించి బుద్ధవరం వద్ద నిమజ్జనం చేశారు. చిన్నఆవుటపల్లిలోని రామాలయం వద్ద, గన్నవరం గౌడపేటలో పిల్లల ఏర్పాటు చేసిన బాలగణపతి ఊరేగింపు సందడిగా సాగగింది. 9 కిలోల లడ్డూ పాట పెట్టగా పామర్తి చిన్న వెంకటేశ్వరరావు రూ.4 వేలకు దక్కించుకున్నారు. గన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 19 విగ్రహాలను నిమజ్జనం చేశారు.



గౌడపేట గ్రామోత్సవంలో భక్తులు..

అంధులైనా..

అదరగొట్టారు

ఔరా అనిపించిన నృత్య ప్రదర్శనలు



భరతనాట్య ప్రదర్శన

సత్యనారాయణపురం(విజయవాడ),న్యూస్‌టుడే : బెంగళూరుకు చెందిన అంధ కళాకారుల బృందం.. ఆకర్షించే నృత్య భంగిమలతో నగరవాసులను అలరించారు. అన్ని సౌకర్యాలు కలిగి ఉన్నా నృత్య ప్రదర్శనల్లో లోపాలుంటున్న నేటి కాలంలో అన్నిటి కంటే ప్రధానమైన నేత్రాలు లేకుండా తమ ప్రదర్శనల ద్వారా ప్రేక్షాభిమానాన్ని చూరగొన్నారు. ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, సాంస్కృతికశాఖ సంచాలకులతో సహా వందలాది ప్రేక్షకులు ఆ ప్రదర్శనకు లేచి నిలబడి వారికి గౌరవం ఇవ్వడం విశేషం. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం రాత్రి ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ప్రాంగణంలో బెంగళూరు కళాకారుల భరతనాట్య ప్రదర్శనలు ఆహూతులను ఆనంద డోలికల్లో ముంచెత్తాయి. భరతనాట్య ప్రదర్శనలతోపాటు, జానపద నృత్యం, గరగనృత్యం, కత్తిసాము వంటి ప్రదర్శనలతో అలరించారు కళాకారులు బుసేగౌడ, శ్రీగురుప్రసాద్, తారకరాముడు, సతీష్‌రావ్, శివస్వామిలు. సువర్ణా వెంకటేష్ నృత్యదర్శకత్వం వహించిన ఈ కార్యక్రమాన్ని గురువు మైసూర్ బి.నాగరాజ్ నిర్వహించారు.

సత్కారం: ఈ సందర్భంగా కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఎన్నో ప్రదర్శనలు చూసానని ముఖ్యంగా అంధ కళాకారుల పాటలు విన్నామని ఈ రకమైన నృత్యప్రదర్శన చూడడం ఇదే మొదటిసారన్నారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన సంచాలకులు విజయభాస్కర్‌ను అభినందించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు విజయభాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో కళలను ప్రతిభకల కళాకారులను గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. గోళ్లనారాయణరావు మాట్లాడుతూ కళ్లున్న వారికి కూడా కళ్లు తెరిపించే కార్యక్రమం అన్నారు. అనంతరం కళాకారులకు రూ.5వేల సాయం అందజేశారు. పట్టుదల ఉంటే సాధ్యంకానిది ఏదీ లేదని కళాకారులు నిరూపించారని గుమ్మా సాంబశివరావు అన్నారు. శివనాగిరెడ్డి, వల్లభరావు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

సమాచార లోపం: సంగీత కళాశాలలో సాంస్కృతికశాఖ వారు నిర్వహించే కార్యక్రమాల గురించి ముందుగా సమాచారం ఇవ్వకపోవడం పట్ల నగరవాసులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులు శ్రద్ధచూపాలని వారు కోరారు.

బూజుపట్టి.. మొలకెత్తి..



ఎస్. అమరవరంలో రోడ్డుపై ఆరబోసిన మినుముపంట

వర్షాలతో అపార నష్టం

రాజధాని జిల్లాల్లో దెబ్బతిన్న మినుము, పెసర పంట

చెట్టు కాయల నుంచే మొలకెత్తుతున్న వైనం

అపరాల పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు ఎడతెరపి లేకుండా కురుస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోతకు వచ్చిన మినుము, పెసర పంటలు తడిసి బూజుపట్టి మొక్కలకే మొలకెత్తుతున్నాయి. ఫలితంగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రైతులకు ₹ కోట్లలో నష్టం వాటిల్లుతోంది. కనీసం పొలం దుక్కి, విత్తనాలు ఖర్చులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు.

- న్యూస్‌టుడే, నందిగామ, నకరికల్లు

గుంటూరు, కృష్ణా జిల్లాల్లో ఖరీఫ్‌లో మెట్ట, మగాణి పైర్లల్లో మొదటి పంటగా మినుము, పెసర పైర్లను రైతులు సాగు చేశారు. కృష్ణా జిల్లాలో పెసర 4582, మినుము 2250 హెక్టార్లల్లో, గుంటూరు జిల్లాలో 10,580 మినుము, 4,152 హెక్టార్లల్లో పెసర సాగు చేశారు. ప్రారంభంలో సాగుకు అనుకూలంగా వర్షాలు పడటంవల్ల పంట సానుకూలంగా ఉంది. మంచి దిగుబడులు వస్తాయని ఆశించారు.

కృష్ణాజిల్లా నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో అపరాలు సాగు చేశారు. కొందరు కోత కోయించడంతో పంట ఇంటికి చేరింది. మిగిలిన రైతుల పంట పొలంలో పైర్లలోనే ఉంది. కంచికచర్ల, వీరులపాడు, నందిగామ మండలాల్లో ఎక్కువగా సాగు చేశారు. గత 15 రోజులుగా వర్షాలు పడుతుండటంతో పొలంలో నీళ్లు నిలిచాయి. పంట కోతకు రావడంతో తేమ ఎక్కువై బూజు పడుతున్నాయి. కాయల్లోని గింజల నుంచి మొక్కలు వస్తున్నాయి. కోత కోయించి ఆరబెట్టి, నూర్పిడి చేయటానికి అవకాశం లేకుండాపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొందరు రైతులు హర్వేస్టర్ సహాయంతో కోత కోయించి గింజలను ఆరబెడుతున్నారు. ప్రస్తుతం దెబ్బతిన్న పంటను తొలగించి తిరిగి రబీలో పైర్లు సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మగాణి భూముల్లో వేసిన అపరాల పంటను వచ్చిన మేర తీసుకుని, తిరిగి వరి సాగు చేస్తున్నారు. ఎకరానికి ₹ 40 వేలు వరకు నష్టపోవాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రోజూ ఆకాశం మేఘావృతమై ఏదో సమయంలో వర్షం పడుతోంది. దీంతో ఉన్న పంట కూడా చేతికొస్తుందే నమ్మకం లేదని వాపోతున్నారు.

గుంటూరు జిల్లాలో కృష్ణా డెల్టాలో వేసిన పంట కొంతమేర రైతులకు చేతికందినా, పల్నాడు ప్రాంతంలోని నకరికల్లు, నరసరావుపేట, రొంపిచర్ల, ముప్పాళ్ల, సత్తెనపల్లి, రాజుపాలెం, తదితర మండలాల్లో పంటలు చేతికందే పరిస్థితి లేకుండా పోయింది. ఒక్క నకరికల్లు మండలంలోనే వర్షాల నేపథ్యంలో దాదాపు ₹ 15 కోట్ల పంట ఉత్పత్తులు కోల్పోనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఆరువేల ఎకరాల్లో సాగైన మినుము, పెసర పైర్లకు తీవ్రస్థాయిలో నష్టం వాటిల్లింది.

గుంటూరు జిల్లాలో నాగార్జునసాగర్ కాల్వలకు గత మూడేళ్లుగా సాగునీరు రాకపోవడంతో రైతులు వర్షాధారంగా అపరాల సాగు చేస్తున్నారు. మినుము, పెసర చెట్ల కొమ్మలన్నీ కాయలతో విరగకాశాయి. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో అవన్నీ తడిసిపోవటంతో బూజుపట్టి తాలుగా మారాయి. ఎకరాకు అన్నీ అనుకూలంగా ఉంటే దాదాపు 10 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయన్న ఆశతో రైతులు ఉన్నారు. అయితే వీరి ఆశలు వరుణుడి రూపంలో ఆవిరయ్యాయి. వర్షాలకు కనీసం పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితిని లేదని తలుచుకొని విలవిలలాడుతున్నారు.

ప్రస్తుతం మినుములు, పెసర క్వింటా రూ. 4వేల వరకు ధరలు పలుకుతున్నాయి. ఎకరాకు సగటున 6 క్వింటాళ్ల చొప్పున లెక్కించినా దాదాపు ₹ 15 కోట్ల మేర పంట ఉత్పత్తులకు నష్టం వాటిల్లిందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.



దేచవరంలో చూపులకే మినుము పైర్లు పచ్చదనం.. కాయలన్నీ బూజుమయం

కౌలుకి తీసుకొని సాగు చేశా



రెండెకరాల పొలం కౌలుకి తీసుకొని మినుము పైరు వేశా. పంట బాగానే పండిందనుకుంటున్న తరుణంలో వర్షాలు కురుస్తున్నాయి. దీనివల్ల పొలంలో నీళ్లు నిలిచాయి. బూజుపట్టి, గింజల్లో నుంచి మొక్కలు వస్తున్నాయి. దీనివల్ల పంట పూర్తిగా నష్టపోవాల్సి వచ్చింది. కూలీ ఖర్చులు గిట్టుబాటు కావట్లేదు. మేమే పీకి రోడ్డుపై వేసి ఆరబెడుతున్నాం. వచ్చిన వరకు పంట వస్తుందని ఆశతో చేస్తున్నాం.

- వెలగా ఆదినారాయణ, ఎస్. అమరవరం, మోగులూరు

పంటను తొలగించటమే భారంగా..

గుంటూరు, కృష్ణాజిల్లాల్లో అసలే నష్టాలతో పీకల్లోతులో మునిగిన రైతులకు సదరు పంటలను తొలగించడం మరింత భారంగా మారింది. కనీసం సాగర్ కాల్వలకు నీరువస్తే పచ్చిరొట్ట ఎరువులుగా వీటిని పొలాల్లో కలియదున్నే అవకాశం ఉండేది. అయితే నీరు రాని నేపథ్యంలో మినుము, పెసరలను రొటోవేటర్‌తో దున్నించడం మరింత భారంగా ఉందని రైతులు కన్నీళ్లపర్యంతమవుతున్నారు. దీంతో అసలు పెట్టుబడులు దక్కకపోగా కనీసం ఎకరాకు పంటను తొలగించాల్సి ఉండటంతో మరో ₹ 1500 వందల వరకు ఖర్చులు అవుతాయని రైతులు చెబుతున్నారు.

అపరాల నష్టంపై వివరాలు రాలేదు

అపరాల పంటకు నష్టం వాటిల్లినట్లు తమకు వివరాలు రాలేదు. దీనిపై పూర్తి వివరాలు తీసుకుంటాం. ముందుగానే కోతలు రావడం వల్ల దిగుబడలు ఆశాజనకంగానే ఉన్నాయి.

- నర్సింహారావు, జేడీఏ

ఇద్దరు ఉపరాష్ట్రపతులను ఇచ్చిన ఏయూ

ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు



ఏయూ పూర్వ విద్యార్థుల అమరావతి విభాగం ఫలకంపై సంతకాలు చేస్తున్న ఏయూ ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు, చిత్రంలో కృష్ణ, ఏఎన్‌యూ ఉపకులపతులు

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆంధ్ర విశ్వవిద్యాలయం దేశానికి ఇద్దరు ఉపరాష్ట్రపతులను ఇచ్చిందని ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన ఆంధ్రా విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల సంఘం అమరావతి విభాగం ప్రారంభ కార్యక్రమంలో ఏయూ, కృష్ణా, ఏఎన్‌యూ ఉపకులపతులు ఆచార్య నాగేశ్వరరావు, ఆచార్య రామకృష్ణారావు, ఆచార్య రాజేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇద్దరు ఉపరాష్ట్రతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, వెంకయ్యనాయుడులను విశ్వవిద్యాలయం అందించిందని, ఈ చరిత్ర దేశంలో మరే విద్యాసంస్థకు లేదన్నారు. 92 ఏళ్ల చరిత్రలో జీఎంఆర్ సంస్థ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, సర్వోన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ వంటి ఎందరో మహానుభావులు ఇక్కడ విద్యనభ్యసించారని చెప్పారు. గత ఏడాది డిసెంబరు17న పూర్వవిద్యార్థుల సమావేశాన్ని నిర్వహించామని ఈ సారి అంతకంటే ఘనంగా లక్షమంది పూర్వ విద్యార్థులతో వేడుకను నిర్వహించనున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు సర్ సీఆర్ రెడ్డి జయంతి సందర్భంగా భారీగా వేడుక జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థుల వివరాలను సేకరిస్తున్నామన్నారు. అన్ని ప్రాంతాలలో ఏయూ పూర్వ విద్యార్థుల విభాగాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వెల్లడించారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలోని ఏయూ పూర్వ విద్యార్థులతో ప్రారంభమైన అమరావతి శాఖ భవిష్యత్తులో మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఎంతో మంది శాస్త్రవేత్తలు, నాయకులు, పారిశ్రామిక వేత్తలను అందించిన ఏయూ మరింత అభివృద్ధి చెందాలని కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రామకృష్ణారావు పేర్కొన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో చదవకపోయినా 33 సంవత్సరాల అనుబంధం ఉందని చెప్పారు. నాకు అన్నం పెట్టిన తల్లి లాంటిదన్నారు. విద్యార్థులు పట్టాలు తీసుకొని బయటకు వెళిపోకుండా విశ్వవిద్యాలయ అభివృద్ధిలో భాగస్తులవాలని కోరారు. పూర్వ విద్యార్థులు స్పందిస్తే విద్యాసంస్థకు పునర్వైభవం వస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు అభిప్రాయపడ్డారు. ఇది మాటలకందని అనుభూతిని కలిగిస్తుందని చెప్పారు. తానూ ఏయూ పూర్వవిద్యార్థిని అయినందుకు చాలా గర్వంగా ఉందని బొమ్మిడాల గ్రూప్ సంస్థ ఛైర్మన్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పూర్వవిద్యార్థి సంఘాలు మంచి పనులు చేసేందుకు విరాళాలు సేకరించాలని సూచించారు. జువాలజీ అధ్యాపకుడినైనా ఫార్మసీలో పీహెచ్‌డీ చేసేందుకు అనుమతి ఇచ్చిన ఏయూకు ఏఎన్‌యూ రెక్టార్ సాంబశివరావు ధన్యవాదాలు చెప్పారు. ఏయూ పూర్వ విద్యార్థి, జీఎస్‌టీ సంయుక్త కమిషనర్ రవిశంకర్ వస్తుసేవల పన్ను చట్టంపై తెలుగులో రాసిన పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఏయూ పూర్వవిద్యార్థుల సంఘం సమన్వయకర్త రాజేశ్, కన్వీనర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

దశాబ్దాల తరబడి అధ్వానంగా ఉన్న పల్లె రహదారులకు మహర్దశ పట్టించేందుకు ప్రభుత్వం చేసిన మంచి ప్రయత్నం ఇంకా కార్యరూపం దాల్చలేదు. రోడ్లు విలీనమై పర్యవేక్షణ అయితే మారింది కానీ అభివృద్ధిలో ఎటువంటి మార్పు జరగలేదు. దీంతో అవే రోడ్లు పల్లె వాసుల్ని వెంటాడుతున్నాయి. విలీనం చేసిన రోడ్ల అభివృద్ధికి ఆర్ అండ్‌బీ శాఖ నిధులు విడుదల చేయడం లేదు. దీంతో అటు ఆర్అండ్‌బీ.. ఇటు పీఆర్.. రెండు శాఖల పరిధిలో రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది.

- న్యూస్‌టుడే బృందం

విలీనం.. విహీనం...!

అధ్వానంగా రహదారులు

ఆర్అండ్‌బీలోకి విలీనమైనా ఫలితం శూన్యం

కేంద్రం కరుణ చూపిస్తే రవాణా వ్యవస్థ మెరుగు

రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షణలో గతంలో ప్రధాన రహదారులే ఉండేవి. మండలాల్లో ఒకటి, రెండు రోడ్లు ఈ శాఖ పర్యవేక్షణలో సాగేవి. మిగిలినవి పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు ఎక్కువ మొత్తంలో తెచ్చే క్రమంలో అర్అండ్‌బీ శాఖ రోడ్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. పీఆర్ రోడ్లను అర్అండ్‌బీ శాఖలో విలీనం చేస్తే ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని పల్లె రోడ్లు శాశ్వత ప్రాతిపదికన బాగుపడతాయనే ఆలోచనను ప్రభుత్వం చేసింది. ఆ మేరకు పల్లెల్లో ముఖ్యమైన రోడ్లను అర్ అండ్‌బీ శాఖలోకి విలీనంచేసే ప్రక్రియను చేపట్టింది.

గుంటూరులో 512, కృష్ణాలో 586 కిలోమీటర్లు

గుంటూరు జిల్లాలో ఆర్అండ్‌బీ శాఖకు చెందిన రోడ్లు 3528 కిలోమీటర్ల మేరకు ఉన్నాయి. వీటిలో జాతీయ రహదారులు 83 కిలోమీటర్లు, రాష్ట్ర రహదారి 522, జిల్లాలో మేజర్ రోడ్లు 2163, గ్రామీణ రోడ్లు 768 కిలోమీటర్లలో ఉన్నాయి.

కృష్ణాలో 3291 కిలోమీటర్ల మేరకు ఆర్ అండ్‌బీ శాఖ రోడ్లు ఉండగా అందులో జాతీయ రహదారి 258, రాష్ట్ర రహదారి 250, జిల్లాలో మేజర్ రోడ్లు 2054, పల్లె రోడ్లు 729 కిలోమీటర్లలో ఉన్నాయి.

ఇవి కాకుండా ప్రభుత్వ ప్రణాళికల మేరకు గ్రామీణ పంచాయతీ రాజ్ శాఖ రహదారులను ఆర్అండ్‌బీ శాఖలోకి విలీనం చేసుకున్నారు. కృష్ణా జిల్లాలో 586 కిలోమీటర్ల మేరకు ఉన్న 92 రోడ్లను విలీనం చేసుకున్నారు. గుంటూరు జిల్లాలో 512 కిలోమీటర్ల మేరకు ఉన్న 88 రోడ్లను విలీనం చేసుకున్నారు. విలీనం చేసుకున్న తర్వాత నిధులు మంజూరై అభివృద్ధిబాట పట్టిన రోడ్లు వేళ్లపై లెక్కించాల్సిన దుస్థితి ఉంది.



కంకర రహదారిని తలపిస్తున్న వేమూరు-వరహాపురం తారు రోడ్డు

రహదారి పేరు : వేమూరు-చింతల చెరువు **ఎన్ని కిలోమీటర్లు :** ఎనిమిది **ఎప్పుడు విలీనం చేశారు? :** మూడేళ్ల **ప్రస్తుత పరిస్థితి :** వేమూరు నుంచి చింతలచెరువు వరకు ఎనిమిది కిలోమీటర్లు ఉన్న రహదారిని చింతలచెరువు నుంచి కుచ్చెళ్లపాడు శివారు వరకు నాలుగు కిలోమీటర్ల మేర రూ. 2 కోట్లతో తారురోడ్డు వేశారు. మిగిలిన నాలుగు కిలోమీటర్లు అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు పడడంతో తారు రోడ్డు కాస్త కంకర రోడ్డును తలపిస్తుంది. చదలవాడ, కుచ్చెళ్లపాడు, వెల్లబాడు, వరహాపురం గ్రామస్థులు మండల కేంద్రం వేమూరు రావడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

- వేమూరు, న్యూస్‌టుడే



ఈనాడు పరిశీలన

సాయిపురం-ముదునూరు రహదారి

గ్రామం : ఎగినపాడు నుంచి సాయిపురం మీదుగా ముదునూరు వెళ్లే రహదారి
రహదారి పొడవు : ఆరు కిలోమీటర్లు
విలీనమైంది? : పీఆర్ నుంచి ఏడాది క్రితం ఆర్అండ్‌బీ శాఖలోకి విలీనమైంది.
ప్రస్తుత పరిస్థితి : రహదారిపై గోతులు పడ్డాయి. వర్షం కురిసినప్పుడు నీరు నిలిచిపోతుంది. మారుమూల గ్రామమైనా సాయిపురం, ఉయ్యూరు శివారు గ్రామాలైన ఎగినపాడు ప్రజలు, రైతులకు ప్రయోజనం చేకూరుతోంది. మరో వైపు ముదునూరు నుంచి ఉయ్యూరు పట్టణం రావడానికి దూరం తగ్గుతోంది.

- ఉయ్యూరు గ్రామీణం



వర్షం కురిస్తే ఇలా..(ప్రత్తిపాడు- చినకొండ్రుపాడు రోడ్డు)

రోడ్డు పేరు: ప్రత్తిపాడు- చినకొండ్రుపాడు (16వ నంబరు జాతీయ రహదారి) వరకు

రహదారి కిలోమీటర్లు : 7 కిలోమీటర్లు

విలీనమైనది? : 2016, ఏప్రిల్

తాజా పరిస్థితి : ప్రత్తిపాడు నుంచి రావిపాటివారిపాలెం, నడింపాలెం, చిన కొండ్రుపాడు 16వ నంబరు జాతీయ రహదారి వరకు విస్తరించి ఉంది. మొత్తం 7 కిలోమీటర్ల రోడ్డులో సుమారు 2 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు వేశారు. మిగిలిన 5 కిలోమీటర్ల రోడ్డు అత్యంత దారుణంగా ఉంది. 2015లో రూ. 5లక్షలతో తాత్కాలిక గుంతలను పూడ్చారు. ఈ రోడ్డులో కాటూరి వైద్యశాల, 16వ నంబరు జాతీయ రహదారికి, యనమదల, ఈదులపాలెం, గ్రామీణ గుంటూరు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లేందుకు దగ్గర మార్గం. దీంతో రోగులు వైద్యం కోసం వెళ్లడానికి, కళాశాలలకు వెళ్లడానికి నరకయాతన అనుభవిస్తున్నారు.

ఏఈ శ్రీనివాసరావు ఏమంటున్నారు?: రూ. 2 కోట్లతో ఏడాదిన్నర క్రితం అంచనాలు తయారు చేసి పంపాం. ఇంకా నిధులు మంజూరు కాలేదు.

- గ్రామీణ ప్రత్తిపాడు, న్యూస్‌టుడే



ముప్పాళ్ల: అధ్వానంగా మాదల-తొండపి రోడ్డు

ఏదీ స్పందన?

గుంటూరు జిల్లాలోని సత్తెనపల్లి నియోజకవర్గంలో గడచిన ఏడాది సెప్టెంబరులో కురిసిన భారీ వర్షంతో గ్రామీణ రోడ్లు ధ్వంసమయ్యాయి. ముప్పాళ్ళ మండలంలోని మాదల రోడ్డు కోతకు గురై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. సత్తెనపల్లి- నరసరావుపేట ప్రధాన రహదారిపై నుంచి మాదల గ్రామంలో మీదుగా రుద్రవరం, తొండపి వరకు పీఆర్ రోడ్డును అర్అండ్‌బీ శాఖలోకి విలీనం చేశారు. భారీ వర్షాల తర్వాత ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉంది. అటు అర్అండ్‌బీ.. ఇటు పీఆర్ శాఖలు రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదు. ఏడాది కావస్తున్నా రోడ్డు అధ్వానంగానే ఉంది. ఏకంగా పీఆర్ సీఈ రోడ్డును పరిశీలించినా నిధుల మంజూరుకు మోక్షం కలగలేదు. అర్ అండ్‌బీశాఖ నుంచి రోడ్డు నిర్మాణానికి పంపిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ఈ పరిస్థితుల్లో పీఆర్ శాఖ నుంచైనా తక్షణమే నిధులు మంజూరు చేయించాలని సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు పల్లె రోడ్ల పరిస్థితి ఇదే విధంగా ఉంది.

- సత్తెనపల్లి, న్యూస్‌టుడే

ప్రాంతం: తెనాలి **రోడ్డు:** తెనాలి-కఠెవరం
పొడవు: 2 కిలోమీటర్లు
విషయం: గత ఏడాది పంచాయతీరాజ్ నుంచి ఆర్అండ్‌బీకి విలీనమైంది. అప్పటి నుంచి పరిస్థితి మరింత దయనీయంగా మారింది.
ఈఈ పకీర్‌బాబు ఏమంటున్నారు? రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపి ఉన్నాం. నిధులు మంజూరు కాగానే పనులు చేయిస్తాం.

- తెనాలి టౌన్, న్యూస్‌టుడే



దుర్భరంగా తెనాలి-కఠెవరం రోడ్డు

ప్రాధాన్యతా క్రమంలో విలీన రోడ్ల అభివృద్ధి

పంచాయతీరాజ్ శాఖ నుంచి తమ శాఖలోకి విలీనమైన గ్రామీణ రోడ్లను ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తామని గుంటూరు జిల్లా అర్అండ్‌బీ శాఖ ఎస్ఈ రాఘవేంద్రరావు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రోడ్ల పరిశీలన పూర్తయ్యిందని ఏఏ రోడ్లను త్వరగా అభివృద్ధి చేయాలనే ప్రణాళికలు రుపొందించి నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు.

రూ.5వేల కోట్లు అవసరం

రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి రూ. 5 వేల కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. జాతీయ, రాష్ట్ర రహదారుల అభివృద్ధికి కేంద్రం నుంచి విరివిగా నిధులు మంజూరవుతున్నప్పటికీ పల్లె రహదారుల ప్రతిపాదనలకు మోక్షం కలగట్లేదు. ఈ క్రమంలోనే కేంద్రం నుంచి నిధులు మంజూరైతే పీఆర్‌లోని అర్ అండ్‌బీశాఖలోకి విలీనమైన రోడ్లు అభివృద్ధిబాట పట్టే అవకాశముంది.

గ్రామం : గుర్విందపల్లి నుంచి తోట్లవల్లూరు వరకు చిన్న కాలువ కట్ట రోడ్డు
రహదారి పొడవు : ఏడు కిలోమీటర్లు
విలీనమైంది? : ఏడాది కిందట ఆర్ అండ్‌బీలోకి విలీనమైంది.
ప్రస్తుత పరిస్థితి : చిన్న కట్ట రహదారి ప్రస్తుతం పూర్తిగా పాడైపోయింది. రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. రహదారిని అభివృద్ధి చేస్తే మండల కేంద్రంమైన తోట్లవల్లూరు వెళ్లడానికి అనుకూలంగా ఉంటుంది.

- తోట్లవల్లూరు, న్యూస్‌టుడే



పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో తోట్లవల్లూరు-గుర్విందపల్లి రహదారి



ముద్దులు కాదు... బుద్ధిమంతులే

అభ్యసన సమస్యలు ఉన్న పిల్లలకు సాధారణ జీవితం సాధ్యమే

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

అఖిల మూడోతరగతి చదువుతోంది. తరగతి గదిలో చాలా చురుకుగా ఉంటుంది. పాఠాల మీద చాలా శ్రద్ధ చూపిస్తుంది. కానీ లెక్కల విషయంలో బాగా వెనకబడుతోంది. ఉపాధ్యాయులు ఎంత ప్రయత్నించినా చిన్న చిన్న కూడికలు, తీసివేతలు కూడా తప్పు చేస్తుంది.

అనిల్ 4వతరగతి. జ్ఞాపకశక్తి చాలా బాగుంటుంది. తరగతిలో ఉపాధ్యాయులు చెబుతుండగా విన్న అంశాలు చాలా బాగా చెబుతాడు. కానీ పరీక్షల్లో అన్నీ తప్పులే రాస్తాడు. పుస్తకం చూసి చదవడని వాళ్ల క్లాస్ టీచర్ తరచుగా ఫిర్యాదు చేస్తుంది. ఇంట్లో వాళ్లు ఒకటి రెండు దెబ్బలు కూడా వేసి చూశారు. ప్రయోజనం లేదు.

వినీల ఆరో తరగతి. సాధారణ విద్యార్థి. బొమ్మలు బాగా గీస్తుంది. చూసి చదవడం కూడా ఫర్వాలేదు. కానీ తరగతిలో ఏది అడిగినా సరిగ్గా సమాధానం చెప్పదని ఫిర్యాదు. ఒకవేళ జవాబు చెప్పినా అడిగిన దానికీ చెప్పేదానికీ పొంతన ఉండదు. ఆ అమ్మాయికి నిర్లక్ష్యమనీ, అశ్రద్ధ అనీ ఉపాధ్యాయులు ఒక నిర్ణయానికొచ్చేసారు. ఇలాగే కొనసాగితే పెద్ద తరగతులు చదవడానికి ఏ మాత్రం పనికిరాదని తేల్చేశారు.

అఖిల, అనిల్, వినీల వీళ్లలాంటి పిల్లలు దాదాపుగా అన్ని పాఠశాలల్లోనూ, అన్ని తరగతుల్లోనూ ఉంటారు. ఉపాధ్యాయులు, తోటిపిల్లలు, తల్లిదండ్రులు వీళ్లకు మొద్దు పిల్లలు అని పేరు పెడతారు. చదువు మీద శ్రద్ధలేదని ఆగ్రహిస్తారు. కానీ అది తప్పు అని నిపుణులు చెబుతున్నారు. మొద్దు పిల్లలు అని ముద్ర వేయబడిన వారు సాధారణంగా మూడు రకాలుగా ఉంటారు. 1. మెదడు లేదా జ్ఞానేంద్రియాల నిర్మాణంలో లోపం వల్ల బుద్ధి మాంద్యం ఏర్పడినవాళ్లు. 2. నిర్మాణ లోపాలు లేకపోయినా తీవ్రమైన అశ్రద్ధ లేదా అతిగా స్పందించే లక్షణం ఉన్నవారు. వీరికి ఏకాగ్రత ఉండదు. దాని వల్ల కొత్త విషయాలు నేర్చుకోవడం కష్టమవుతుంది. 3. నిర్మాణ లోపాలు లేకపోయినా ఏకాగ్రత లోపాలు లేకపోయినా కొత్త విషయాలు, ముఖ్యంగా తరగతి గదిలో పాఠాలు నేర్చుకోవడంలో సమస్యలు ఉన్నవారు. మూడో రకం వారి సమస్యను శాస్త్రీయంగా "లెర్నింగ్ డిజెబిలిటీ (అభ్యసన వైకల్యం) అంటారు.

అభ్యసన సమస్యలు అంటే...

తెలివితేటలు, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత ఉండి కూడా నేర్చుకోవడంలో సమస్యలున్నవారు. జ్ఞానేంద్రియాల ద్వారా అందుతున్న సమాచారాన్ని సక్రమంగా అర్థం చేసుకోవడంలో తడబడుతుంటారు. కంప్యూటర్ పరిభాషలో చెప్పాలంటే సాఫ్ట్‌వేర్ సమస్య అన్నమాట.

కొంతమంది అంకెలను గుర్తించడంలో కంగారుపడతారు. వీరికి **3–8, 5–6–9 ఇలా ఒకేలా కనిపించే** అంకెల మధ్య తేడా అర్థం కాదు. మరికొందరు అక్షరాలను గుర్తించడంలో విఫలమౌతుంటారు. వీరికి తెలుగులో **న–స ప–వ, మ–హ,** ఆంగ్లంలో **బి–డి, సి–ఇ, ఎ–ఒ, ఎన్–ఎమ్–డబ్ల్యు** ఇలా ఒకేలా కనిపించే అక్షరాల మధ్య తేడా గుర్తించలేరు. కొంతమందికి బొమ్మలు అర్థం కావు, సైన్సులో, గణితంలో గుర్తుల విషయంలో తడబడతారు. మరికొందరికి పదాలను అర్థంచేసుకువడంలో అయోమయానికి గురవుతారు.

పరీక్షల సంగతేమిటి?

చిన్న తరగతుల్లో వాళ్లకు సమస్య ఉన్న అంశాలలో తక్కువ మార్కులు వచ్చినా ఓపిక పట్టాలి. వారికి నేర్చుకొనేందుకు తగిన సమయం ఇవ్వాలి. ఒకసారి అభ్యసన లోపాలకు సంబంధించిన శాస్త్రీయంగా పరీక్షలు చేయించుకొని వైకల్య ధ్రువపత్రం పొందవచ్చు. అలా ధ్రువపత్రం పొందితే పరీక్షలలో తక్కువ మార్కులకే ఉత్తీర్ణత ఇచ్చేలా రాయితీ పొందే అవకాశం ఉంది. ఈ మేరకు కేంద్రప్రభుత్వ చట్టం దేశమంతటా అమలులో ఉంది.

విజయానికి అడ్డంకులు కావు



కృష్ణదాస్

అక్షరాలతో, అంకెలతో సమస్యలున్నవారు మంచి చిత్రకారులు, నాట్యకారులు, నటులు, ఆటగాళ్లు కావచ్చు. చేతివృత్తులలో నిపుణులు కావచ్చు. ఆలోచించి చూస్తే రోజువారీ మనకెదురయ్యే వృత్తులలో అక్షరాలతో అంకెలతో సంబంధం లేకుండా ఉన్నవీ, చాలా తక్కువగా ఉన్నవీ అనేక వృత్తులున్నాయి. వాళ్ల రోజువారీ వ్యవహారాలను కాలుక్యులేటర్ వంటి ఉపకరణాలతో నిర్వహించుకోవచ్చు. ప్రస్తుతం శబ్దాన్ని లిపిగా మార్చే సాంకేతిక ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. అభ్యసన లోపాలున్న విద్యార్థులను శిక్షణ ద్వారా సాధారణ విద్యార్థులుగా, పౌరులుగా తీర్చిదిద్దడం సాధ్యమే. అంగ వైకల్యాలను, అభ్యసన, ఏకాగ్రతా లోపాలను వేరు చేయడంలో ఉపాధ్యాయులకు తగిన శిక్షణ లేకపోవడం వల్లే చాలా మంది విద్యార్థులు నష్టపోతున్నారు.

- డాక్టర్ పామర్తి కృష్ణదాస్, సైక్రియాటిస్టు



రెండు జిల్లాల్లో...

రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల కమిషనరేట్ వారి అధికారిక సర్వే ప్రకారం కృష్ణాజిల్లాలో 1678మంది, గుంటూరు జిల్లాలో 1305మంది విద్యార్థులు అభ్యసన వైకల్యంతో బాధపడుతున్నారు. అయితే ఈ సంఖ్య కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో చేసిన పరీక్షల ప్రకారం, ఈ రకమైన వైకల్యాల మీద అవగాహన ఉన్న ఉపాధ్యాయులు వైకల్యం ఉన్నవారిగా గుర్తించిన విద్యార్థుల సంఖ్య మాత్రమే. రెండు జిల్లాలోనూ కలిపి గుర్తింపు పొందిన ప్రభుత్వేతర పాఠశాలలు 2255 ఉన్నాయి. ప్రభుత్వేతర పాఠశాలల్లో చదివే విద్యార్థులలో అభ్యసన వైకల్యాలు ఉన్న వారిని కూడా గుర్తిస్తే ఈ సంఖ్య రెండు, మూడు రెట్లు పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

గుర్తించడం ఎలా?

అభ్యసన లోపాలను గుర్తించడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. కొంతమంది విన్న పాఠాలు బాగానే అప్పజెప్పి, రాతలో తప్పులు చేస్తారు. వీరికి బద్ధకం అనుకోకుండా ఎలాంటి అక్షరాలు ఎక్కడ తప్పు రాస్తున్నారో విశ్లేషించాలి. ఏదో ఒకటి, రెండు విభాగాల్లో వెనుకబడి మిగిలిన విభాగాల్లో చురుకుగా ఉండటం ఈ రకమైన వైకల్యాలను గుర్తించడంలో గుర్తుంచుకోవాల్సిన అంశం. ఇలాంటి పిల్లలకు, బుద్ధి మాంద్యం, ఇతర ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు సహాయపడేందుకు ప్రభుత్వం సర్వశిక్షా అభియాన్ ద్వారా మండలానికి కనీస ఒక 'భవిత' కేంద్రాన్ని స్థాపించింది. అక్కడ ఈ వైకల్యాలను గుర్తించే నిపుణులుంటారు. శిక్షణ పొందిన సైకాలజిస్టులు, సైక్రియాటిస్టులు కూడా అభ్యసన లోపాలను గుర్తించడానికి పరీక్షలు నిర్వహిస్తారు.

ఇలా అధిగమించవచ్చు..

అభ్యసన లోపాలు పుట్టుకతో వచ్చినవే. వీటిని నూటికి నూరు శాతం తగ్గించడం సాధ్యం కాదు. కానీ శాస్త్రీయమైన శిక్షణ ద్వారా 80% దాకా తగ్గించవచ్చు. ఒక కథను విని తెలుసుకోవచ్చు, వీడియో చూసి తెలుసుకోవచ్చు. పుస్తకంలో చదివి తెలుసుకోవచ్చు. ఇలా ప్రతి విషయాన్నీ నేర్చుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలుంటాయని గమనించాలి. ముఖ్యంగా అభ్యసనలోపాలున్న విద్యార్థులలో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత బాగుంటాయి. వాళ్లను కంగారుపెడితే తప్పులు ఎక్కువ చేస్తారు. చిన్న తరగతులలో తగిన సమయం ఇస్తే వారికి అయోమయంగా ఉన్న అంశాలలో స్పష్టత తెచ్చుకొనేందుకు వారే మార్గం కనుక్కోగలరు కూడా.

మరపు... మంచిదే!



- చిన్న సమస్యల్ని దీర్ఘకాలం ఆలోచిస్తే కుంగుబాటు
- వాస్తవికత దృష్టితో ఆలోచించడం మేలు
- చిన్న మరపు సానుకూలమే అంటున్న పరిశోధనలు

అమరావతి ఫీచర్స్, న్యూస్‌టుడే

విజయవాడకు చెందిన రామారావు తనకు నగరంలో ఉన్న 4 సెంట్ల స్థలాన్ని రూ.14 లక్షలకు తెలిసిన స్నేహితుడికి విక్రయించాడు. అగ్రిమెంట్‌పై చాలాకాలం ఉంచుకున్న మిత్రుడు అదే స్థలాన్ని రూ.18 లక్షలకు విక్రయించి ఆ విషయాన్ని దాచాడు. నేరుగా రామారావు ఆ వ్యక్తికి రిజిస్ట్రేషన్ చేశాడు. అంతా అయిపోయిన తర్వాత ఎంతకు ఆ స్థలాన్ని కొనుగోలు చేశారని స్థల కొనుగోలుదారుడిని ఆయన అడిగారు. రూ.18 లక్షలకు స్థలం కొన్నానని అతడు చెప్పడంతో వేదన చెందాడు. ఇక ఆ విషయాన్ని అంతటితో మరిచిపోకుండా కుంగిపోయాడు. తనకు రూ.4 లక్షల నష్టం జరిగిందని అదే సమస్యను దీర్ఘకాలం ఆలోచిస్తూ అనారోగ్యం బారినపడ్డాడు. ఒక్కసారిగా అధిక రక్తపోటు, మధుమేహం, హృద్రోగం అతడిపై దాడి చేశాయి. ఆస్పత్రుల వెంట తిరిగితే రూ.లక్షల నగదు ఖర్చయ్యింది. కుంగుబాటు అనారోగ్యంతోపాటు ఆర్థికంగానే దెబ్బతీస్తుంది. ఇలా జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని ఎక్కువ ఆలోచిస్తూ అనారోగ్యం బారిన నవ్యనగరిలో ఎంతోమంది పడుతున్నారు.

ఓటమి.. వైఫల్యం.. అవమానాలు.. ఆర్థిక, సామాజిక సమస్యలు.. ఇవి ప్రతి వ్యక్తికి ఏదో సందర్భంలో ఎదురయ్యేవే. అయితే వాటిని అవసరం మేరకే గుర్తించుకోవడంతో ఎటువంటి ఇబ్బంది ఉండదు. పైగా ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుంటే విజయాలు వరిస్తాయి. అయితే అసలు సమస్యను వదిలేసి తాను గతాన్ని మరువలేకపోతున్నానని దుర్వ్యసనాలకు ఎంతోమంది లోనవుతున్నారు.

మరపు.. ప్రతి వంద మందిలో 60 నుంచి 70 శాతం మందికి ఎదురయ్యే సమస్య ఇది. దీన్ని అనారోగ్య సమస్యగా భావించే వారు ఎంతో మంది. అయితే మరపు వేరు మతిమరువు వేరని వైద్య నిపుణులు చెబుతున్నారు. వయస్సు పైబడటం.. అధిక మందుల వినియోగం.. మెదడులో కల్లోలం.. హెచ్‌వీఐ, పార్కిన్సన్ వ్యాధులతో మతిమరపు వస్తుంది. ఇది అతి కొద్దిమందికే ఉంటుంది. అయితే ఎక్కువమంది చిన్న చిన్న మరపు బారినపడుతుంటారు. అది ఆరోగ్యానికి ఎంతో మంచిదని.. మెదడు బాగా పనిచేస్తుందని తెలుసుకునేందుకు ఒక నిదర్శనమని ప్రపంచవ్యాప్త పరిశోధనలు తేల్చాయి. అయితే నవ్యనగరి ప్రాంత పరిధిలో ఎక్కువమంది చిన్న సమస్యల్ని దీర్ఘకాలం ఆలోచిస్తూ కుంగుబాటుకు లోనవుతున్నారు. జరిగేవన్ని మంచికని అనుకోవడమే మనిషి పని అనే భావనతో మెలిగితే ఎంతో మంచిదని వైద్య నిపుణులు చెబుతున్నారు. మరపు.. మతిమరుపు.. ఈ రెండింటికి తేడా ఒకచోట స్పష్టంగా కనిపిస్తుంది. జీవితంలోని చేదు జ్ఞాపకాల్ని త్వరగా మరచిపోయి వర్తమానంపై దృష్టి సారిస్తూ చిన్నచిన్న విషయాల్ని మరచిపోతుంటే దాన్ని పెద్దగా పట్టించుకోనక్కర్లేదు. అదేపనిగా చేదు విషయాలతో అనారోగ్యం బారినపడితే మతిమరపు వస్తుంది. దీంతో మెదడు పనితీరు దెబ్బతింటుంది.

ఇలా చేస్తే మరపు మంచిదవుతుంది



- రోజులో కనీసం 40 నిమిషాల పాటు వ్యాయామం చేయడం.
- పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం.
- ధ్యానం చేయడం.. పుస్తక పఠనం, ఈత అలవాటు.

అవి అందుకే సంతోషంలో ముందంజ



నార్వే దేశం

సంతోష సూచీలో నార్వే దేశం మొదటి స్థానంలో ఉంది. స్వీడన్, డెన్మార్క్, స్విట్జర్లాండ్ దేశాలు మొదటి 10 స్థానాల్లో ఉన్నాయి. ఆ దేశ వాసులు తమకు అవసరంలేని విషయాన్ని కేవలం ఐదు, పది నిమిషాల్లోనే మరచిపోతారు. వాస్తవిక దృక్పథాన్ని చాలా దగ్గరగా వారి జీవనం ఉంటుంది. దీంతో వారి మేధా.. జ్ఞాపకశక్తి ఆరోగ్యకరంగా ఉంటుంది. సంతోషం ఎల్లప్పుడూ వారి వెంట ఉంటుంది.

ఇక్కడా నిగ్గు తేలిందిదే...



కెనడాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ టోరంటో మరపుపై పరిశోధన చేసింది. చిన్నచిన్న అంశాలను మరిచిపోవడం ద్వారా మెదడులో నూతన న్యూరాన్లు ఏర్పడి అవి జ్ఞాపకశక్తిని పెంచుతున్నాయని తేలింది. అవసరమైన వాటినే గుర్తించుకునేలా మెదడు తయారయ్యేందుకు నూతన న్యూరాన్లు దోహదపడుతున్నాయని పరిశోధన తేల్చింది.



యూనివర్సిటీ ఆఫ్ ఒరేగాన్ మరపుపై చేసిన పరిశోధనను న్యూసైంటిస్టు మేగజైన్ ప్రచురించింది. అందులో 20 మంది వ్యక్తుల మేధా.. జ్ఞాపకశక్తిని పరీక్షించారు. చిన్న విషయాల్ని మరచిపోలేని వారి మెదడు సరిగా పనిచేయట్లేదని. అదే చిన్న మరపులు ఉన్న వారి మెదడు చురుగ్గా.. సృజనాత్మకంగా పనిచేస్తుందనే విషయం వెల్లడైంది.

తాజా పరిశోధనలో ఏం తేలిందంటే..

నార్వేజియన్ విశ్వవిద్యాలయం ప్రవర్తనౌషద పరిశోధకుడు హన్స్ నోడల్ మరపుపై ఒక పరిశోధన చేశారు. అందులో మరపు మంచిదే అనే విషయం తేలింది. సమస్య గురించి అదే పనిగా ఆలోచిస్తే సమయం వృథా.. శుద్ధ దండగ అని బాధకు కారణాన్ని వాస్తవిక దృక్పథంతో ఆలోచన చేసి పరిష్కారాన్ని స్వయంగా కనుగొని ఆచరించాలని పరిశోధన నివేదికలో వెల్లడించారు.

మెదడు.. సెల్‌ఫోన్.. కంప్యూటర్‌లాంటిదే..


మెదడు సెల్‌ఫోన్.. కంప్యూటర్‌లాంటిదే.. అందులో ఉండే వివిధ ఫీచర్లలోని ఇన్‌బాక్స్ ఫుల్ అయిన వెంటనే ఖాళీ చేయాలి. అప్పుడే నూతన విషయాలు అందులో నిక్షిప్తమవుతాయి. రోజూ అలవాటయ్యే విషయాలు మెదడులో నిక్షిప్తమై ఉంటాయి. సవివిరంగా కాకుండా అవి అవసరం మేరకు విషయాన్ని మెదడు ద్వారా సమాచారాన్ని చేరవేస్తాయి. ఈ విషయాన్ని మనం గుర్తించకుండా మతిమరపు వస్తుందేమోనని ఆందోళన చెందుతుంటాం.

మరపుతో ముఖ్య ప్రయోజనాలివి..



మరపుతో ఐదు ముఖ్య ప్రయోజనాలుంటాయని వివిధ అంతర్జాతీయ పరిశోధనల్లో తేలిందని విజయవాడకు చెందిన మానసిక వైద్య నిపుణులు.. **ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శశికిరణ్ తెలిపారు. అవేమంటే..**

- చిన్నచిన్న మరపు మెదడులో జ్ఞాపకశక్తిని పెంచుతుంది. నూతన అనుభవాలు, కొత్త విషయాలు తెలుసుకునేలా ఉత్తేజితుల్ని చేస్తుంది.
- ఇంకా మెదడు సమర్థంగా పనిచేసేందుకు దోహదపడుతుంది.
- మంచి నిర్ణయాలు తీసుకునేందుకు దోహదం చేస్తుంది. ప్రాధాన్యతలు.. వాటి ప్రభావాలు తెలియజేసి నిర్ణయాలను వ్యక్తులకు వదిలేస్తుంది. సమాచారాన్ని క్షణాల్లో తెలియజేస్తుంది.
- మెదడు సృజనాత్మకంగా ఆలోచించేలా తోడ్పాటు అందిస్తుంది.
- మెదడు ఆరోగ్యకరంగా ఉంటుంది. మంచి ఆలోచనల్ని స్వాగతిస్తుంది. పనికిరాని విషయాల్ని బయటకు పంపిస్తూ కొత్త విషయాల్ని తెలియజేస్తుంది.





సంగీతం... సై ఆట

వ్యాయామ విద్యలో ఆహ్లాదకర మార్పులు ❑ రాజధాని ప్రాంత పాఠశాలల్లో అమలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

పెద్ద విజిల్...వినగానే చాలా మంది పిల్లలలో ఒకలాంటి నీరసం, మరోలాంటి భయం. ఎందుకంటె అది పీఈటీ నుంచి క్రీడలకు రమ్మని సంకేతం. పరుగు పందాలు, ఇతర ఆటలు...తుదకు కాళ్ల నొప్పులు. అసలు ప్రతి రోజూ ఈ పిరియడ్ ఎందుకు ఉందిరా బాబూ అనుకుంటూ ఉసూరుమని పాఠశాల ఆవరణకు వెళ్లే పరిస్థితి. అయితే ఇప్పుడు అదే విజిల్ ఎప్పుడెప్పుడు వినపడుతుందా...ఎప్పుడు ఆటలకు వెళదామా అని విద్యార్థులు ఎదురు చూసే స్థితి. దీని వెనుక ఏ మాయే, మర్మమో లేదు, కేవలం పిల్లల మనస్సులకు అనుగుణంగా వారి మనస్సులకు నచ్చేలా విధానాన్ని మార్చుకున్నారు...అంతే.

సంగీతంతో కూడిన ఆటలు: ఆటల పట్ల విద్యార్థులలో ఆసక్తిని పెంచటానికి వాటికి సంగీతాన్ని జోడించే విధానం పాశ్చాత్య దేశాలలో గతం నుంచే అమలులో ఉంది. ప్రధానంగా ఆమెరికాలోని ప్రతి ప్రాథమిక స్థాయి పాఠశాలలలో ఇది కచ్చితం. మంచి సంగీతం వస్తుంటే ఏమీ తెలియని పసి పిల్లవాడు సైతం కాళ్లు చేతులు ఊపటాన్ని మనం నిత్యం గమనిస్తూనే ఉంటాం. ఈ క్రమంలోనే వ్యాయామ విద్యలో చక్కని సంగీతాన్ని జోడించి విద్యార్థులలో ఉత్సాహాన్ని, క్రీడలపై ఆసక్తిని కలిగించే ప్రయత్నాలు మన ప్రాంతంలోనూ మొదలయ్యాయి. దీని కోసం లయబద్ధ సంగీతానికి అనుగుణంగా ఆటలను మేళవించి విద్యార్థులకు అటు క్రీడలు, ఇటు వ్యాయామం వల్ల కలిగే ప్రయోజనాలను అందించే ప్రత్యేక సంస్థలు తమ పనిని ప్రారంభించాయి. రాజధాని జిల్లాలైన గుంటూరు, కృష్ణాలోని పలు పెద్ద పాఠశాలలో తాజాగా ఈ విధానం అమలవుతోంది.

విద్యార్థులలో సంబరాలు: రిథమిక్‌గా, టెంపోతో కూడిన పెప్పీ మ్యూజిక్ తోడుగా ఇప్పుడు విద్యార్థులు ఆటలాడుతున్నారు, కేరింతలు కొడుతున్నారు. సంతోషంతో ఊగుతున్నారు. నిపుణులైన శిక్షకుల సలహాలతో, శరీరంలోని అన్ని భాగాలకు సమానమైన రీతిలో వ్యాయామాన్ని అందిస్తున్నారు. వీటిల్లోనూ 1, 2 తరగతుల వారికి ఒకలా, 3, 4, 5 తరగతుల వారికి మరోలా, ఆ పై తరగతుల వారికి ఇంకోలా సంగీతం, ఆటలు ఉన్నాయి. పరుగులు, జంపింగ్‌లు, వాలిబాల్, ఫుటబాల్, షాటపుట్ వంటివన్నీ దశల వారీగా సాగిపోతున్నాయి.

మార్కు లు, గ్రేడింగ్‌లు, ప్రాజెక్టు వర్క్‌లు: నూతన విధానంలో క్రీడల కోసం ప్రత్యేక మార్కుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. క్రీడలో వారి శైలి, గత నెలతో పోలిస్తే ఈ నెలలో సాధించిన ప్రగతి, నిపుణుల అంచనా ప్రకారం ఆ విద్యార్థికి ఏ క్రీడ అయితే బావుంటుంది, వంటివన్నీ నమోదు చేసి తల్లిదండ్రులకు పంపుతున్నారు. వీటితో పాటు శరీరానికి ఎటువంటి ఆహారాన్ని అందించటం ద్వారా సరైన పోషకాలు లభిస్తాయి, ఏ ఆటలు ఆడే వారికి ఎటువంటి ఆహారం కావాలి వంటివి వ్యాయామ విద్యలో భాగంగా చెబుతున్నారు. ఒక బఫే డిన్నర్ నడుస్తుంటే ఒకే రకమైన ఆహారాన్ని తీసుకోవటం కంటె విభిన్నమైన, మనకు అవసరమైన 'థాలి'ని ఎలా ఎంచుకోవాలన్నది విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్నారు. చెప్పిన అంశాలకు అనుగుణంగా ప్రాజెక్టు వర్క్‌లు చేయించటం ద్వారా విషయాన్ని వారి మనస్సులలో నాటుకునేలా ప్రయత్నిస్తున్నారు. మొత్తం మీద ఆధునిక వ్యాయామ విధానం విద్యార్థులలో సంపూర్ణ వికాశానికి దోహదం చేసేలా సాగుతుంది. పిల్లల సంతోషపు ఆటలు పెద్దలకూ చేరుతుండటంతో, వారూ ఆనందపడుతున్నారు. పాఠశాలల నిర్వాహకులు సైతం తల్లిదండ్రుల మన్ననలు చూరగొంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలలలోనూ ఆచరణలోకి తీసుకురావచ్చు: విధానం అయితే తెలిసింది కాబట్టి, ప్రభుత్వ పాఠశాలలలోనూ ఈ తరహా విధానాలను అమలు చేయటానికి ప్రయత్నించవచ్చు. మక్కీకిమక్కీ కాకపోయినా ఆయా పాఠశాలలకు తగిన విధంగా ఆటలకు సంగీతాన్ని జోడించి క్రీడలకు జోష్‌ను జత చేయవచ్చు. దీనికి విడిగా నిధులు కూడా అవసరం లేదు. కేవలం సరైన కార్యాచరణ చాలు. వ్యాయామ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పూనుకుంటే సరిపోతుంది.



సంగీతం తోడవడంతో జోరుగా..హుషారుగా



వినూత్న ప్రయోగాలతో క్రీడలపై ఆసక్తి

విద్యార్థులలో ఆటలంటే ఆసక్తి పెరిగింది

- జె.సూరజ్‌మోహన్, కరస్పాండెంట్, సెయింట్‌జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్, తెనాలి

ఆటలకు తగిన మ్యూజిక్‌తో సాగుతున్న వ్యాయాయ విద్య విద్యార్థులకు బాగా నచ్చుతుంది. గతంలో ఆటలంటె పెద్దగా మక్కువ చూపించని వారు సైతం ఇప్పుడు విజిల్ వినగానే పరుగెత్తుకు వస్తున్నారు. ఆటలతో పాటు ఆరోగ్య విద్యకూడా వారికి భవిష్యత్తులో బాగా ఉపయోగపడుతుంది. చక్కని ఆరోగ్యం ఉన్న విద్యార్థులు చదువులోనూ చురుకుగా ఉంటారు. వారి ఏకాగ్రత శక్తి కూడా పెరుగుతుంది. కొత్త విధానం భావి తరాలకు బంగారు బాటను అందించే క్రమశిక్షణను అలవర్చుతుందని భావిస్తున్నాం.

కండరాల శక్తి పెరుగుతుంది

- చందు వెంకటేశ్వరరావు, ట్రైనర్

ఆటలైనా, వ్యాయామమైనా సంగీతంతో జత కలిస్తే వాటిని చేసే వారికి పెద్దగా శ్రమ తెలియదు. మానసికంగా మ్యూజిక్‌ను ఎంజాయ్ చేస్తూ తమ పని ముగించుకుంటారు. దీని వల్ల త్వరగా అలసట అనిపించదు. సంగీతం నిర్ణీత సమయం పాటు కొనసాగుతుంది కాబట్టి క్రమంగా దానిని అనుసరంచి క్రీడలు కూడా జరుగుతాయి. ఫలితంగా పిల్లలలో కండరాల శక్తి పెరుగుతుంది. వారిలో రోగ నిరోధక శక్తి బలాన్ని పెంచుకుంటుంది. ఎలా చూసినా ఈ కొత్త విధానం చాలా మంచిది. అందరూ ఆచరించవచ్చు.



ఆటకు పాట తోడు

జై..జై...గణేశా...



అమరావతి ప్రాంతంలో గణేశుని ప్రతిమల నిమజ్జనోత్సవం ప్రారంభమైంది..మూడో రోజు పలు విగ్రహాలను విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద నిమజ్జనం చేశారు. జైజై గణేశా...జై కొడతా గణేశా అంటూ భక్తులు నినదించారు...

– ఈనాడు, అమరావతి



EENADU CLASSIFIEDS

BUSINESS SERVICES

BUSINESS OFFER

ప్లాస్టిక్ పరిశ్రమ - మెషిన్లు అమ్మకం. ఇంటివద్దనే సరుకు తయారీ, ముడిసరుకు ఇచ్చి తయారైనది కొంటాం. నెలకు 20 వేలు పైగా ఆదాయం. 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. RJ ఎం॥ప్రై॥, ✆ 82978 55908.

తక్కువ పెట్టుబడితో ఇంట్లో ఉంటూ పేపర్ ప్లేట్స్ తయారుచేసే మెషిన్లు కలవు. ముడిసరుకు ఇస్తాం, తయారైన సరుకు మేమే కొంటాం. అగ్రిమెంట్ కలదు. Govt. రిజిస్ట్రేషన్. Cont: సాయివిగ్నేష్ ఏజెన్సీస్. ✆ 98483 43452.

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారుచేయు మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు పైగా ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్. సై్క ఇంజినీరింగ్ కం॥, విజయవాడ. ✆ 88972 67259.

పార్ట్ / ఫుల్ టైం (ఇంట్లో ఉంటూ) MLM కంపెనీకి వర్క్ చేస్తూ వారం వారం అధిక ఆదాయం (నిరుద్యోగులు, గృహిణిలు, విద్యార్థులు). Cont: 7799406283, 8142203674.

HEALTH CARE

WEIGHT LOSS CENTER

5 వారాలలో డైట్ లేకుండా 8-10 KG ల బరువు, చేతులు, తొడలు, పొట్టసైజు, మలబద్ధకం, గ్యాస్ట్రిక్ ప్రాబ్లం, మోకాళ్ళనొప్పులు తగ్గుతాయి. Ph: 9059320974

HOME NEEDS

MOSQUITO SCREENS

Image మస్కిటోనెట్స్ డోర్స్ & విండోస్, మాడ్యులర్‌కిచెన్, చిమ్నీ + Hobs @ పాలిక్లినిక్‌రోడ్, బెంజిసర్కిల్ దగ్గర VJA ✆ 98494 23555, 98661 56677.

MARRIAGE SERVICES

FUNCTION HALLS

సాయిబాలాజీ కళ్యాణవేదిక MG రోడ్, పోరంకి. బర్త్‌డే, పంచెలు, ఓణీలు, ఎంగేజ్‌మెంట్ మొదలగు ఫంక్షన్స్‌కు 200 మందికి బఫెట్ మీల్స్‌తో ప్యాకేజీ 99,999/-లు (పగలు మాత్రమే) ✆ 92464 72573.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

PEOPLE CARE

OLD AGE HOME

శ్రీలలితా హోమ్ కేర్ & నర్సింగ్ సర్వీసెస్, వృద్ధులకు, బెడ్ పేషంట్లకు 24 గం॥లు మీ ఇంటి వద్దనే అన్ని రకముల సేవలు, ఆయాలు, నర్సులు, అటెండర్లను పంపబడును. ✆ 96032 49911/22

REAL ESTATE

AP రాజధానిలో మంగళగిరికి, 4 కి.మీ సాఫ్ట్‌వేర్ కంపెనీలకు పులింగ్ ఆనుకొని డ్యూప్లెక్స్ విల్లాస్ 64 లక్షలు ఓపెన్ ప్లాట్స్. గ॥ 9000/- 90% బ్యాంక్ లోన్ ✆ 92464 70909.

L&T మేధాటవర్స్‌కు వెనుక, 0.3 KM దూరంలో 150 హౌస్‌లు నిర్మించబడిన టౌన్‌షిప్‌నందు 2 BHK 36 లక్షలు, విల్లాస్ 55 లక్షలు నుండి, లోన్ సౌకర్యంతో కలవు. ✆ 93464 92929.

పొలములు, ఇళ్ళు, ఇండ్ల స్థలములు అమ్మదలచిన, కొనదలచిన సం॥ అందుబాటు రేటులో 2 BHK, 3 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. సం॥ 79814 99420.

FLAT FOR SALE

S.Ft. 3,300/-లకే VJA బందరురోడ్డు దగ్గరలో తాడిగడపలో స్విమ్మింగ్‌పూల్, క్లబ్‌హౌస్, జిమ్, హోంథియేటర్, RO వాటర్, సోలార్ వాటర్ తదితర సౌకర్యాలతో 2 & 3 BHK లగ్జరీ అపార్టుమెంట్లు గృహప్రవేశానికి సిద్ధంగా కలవు. సంప్ర: 73372 43565, 94401 20033.

2 BHK Under Construction Flats and Commercial Space in Currencynagar are for Sale ✆ 91004 42647, 43.

2BHK Budjet Flats in Ramavarappadu & Nidamanuru for Sale. Loan Facility available. ✆ 91004 42651, 91004 42642.

శ్రీనివాసానగర్ బ్యాంక్ కాలనీ వీరకాకాని వీధిలో 2 B/R తూర్పు ఫేసింగ్ గ్రౌండ్ ఫ్లోర్ ఫ్లాట్ అన్ని వసతులతో అమ్మకం. ✆ 80088 00899, 70327 25262.

PLOT FOR SALE

వినాయకచవితి ఆఫర్: లోకాస్ట్ ప్లాట్స్: టూవీలర్ ఫ్రీ బందరురోడ్డు - పామర్రు దగ్గర ఉరుటూరులో ఇళ్ళకు దగ్గర ఇల్లు కట్టుకొనుటకు & మంటాడ రోడ్డు ఫేస్‌లో CRDA ప్లాట్స్ ✆ 88018 03689.

విజయవాడ – గుంటూరు మధ్య మంగళగిరి సమీపంలో Sunrise Projects. గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, ప్లాట్లు. AP CRDA, RERA నిబంధనలతో LEPL వారి సౌజన్యంతో. రఫీ. 99661 49858.

ఫ్లాష్.. ఫ్లాష్... అమరావతి, ఔటర్ రింగ్‌రోడ్డుకు దగ్గర, 100 చ.గ. 3.50 లక్షలు & గన్నవరం, నూజివీడులలో CRDA ప్లాట్లు కలవు. ఓపెనింగ్ ఆఫర్ 5 గ్రా. గోల్డ్ ఫ్రీ. ✆ 89858 22844.

REPAIRS

A.Cలు, వాషింగ్ మెషిన్స్, T.V లు గ్యారంటీగా మీఇంటి వద్దనే రిపేరు చేయబడును. మరియు ప్లంబింగ్ వర్క్స్ కొరకు సంప్ర MR ఎలక్ట్రానిక్స్, పటమట, విజయవాడ. ✆ 83414 00281, 84999 50163.

TO-LET

SLV అంజని హైట్స్, Opp: పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజి అన్ని సౌకర్యాలతో గేటెడ్ కమ్యూనిటీలో 3 BHK ఫ్లాట్స్ అద్దెకు కలవు. ✆ 99122 43303, 91776 66066.

One BK Apartment on Rent at Poranki Krishnaveni School Road. Please Contact Mobile 8008016379

చుట్టుగుంట సెంటర్, BSNL ఆఫీసు ఎదురుసందు JMD భవన్ G/Fలో (తూర్పు) 1600 చ॥అ॥ 3 BHK ఫ్లాట్ కార్ పార్కింగ్, AC, ఫర్నీచర్‌తో సహా ఫ్యామిలీస్/ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. ✆ 94401 04646

గన్నవరం, Airport, IT Park, Medical College & Industrial Park లకు సమీపంలో ఉన్న 6 BHK (All Attached) Lift & Car Parkingతో ఉన్న Individual Triplex House అద్దెకు కలదు. ✆ 78934 57777.

విజయవాడ పోరంకి ప్రభునగర్, బొప్పన హాస్పిటల్ వెనుక 3 బెడ్‌రూమ్ Flat అద్దెకు కలదు. వివరాలకు: 96403 31999.

COMMERCIAL

గవర్నరుపేట బీసెంట్‌రోడ్డు LIC బిల్డింగ్ ప్రక్కన హెల్ప్ హాస్పటల్ రోడ్డులో 1st & 2nd ఫ్లోర్స్ (1560 Sq.Ft ఒక్కొక్కటి) పార్కింగ్ సౌకర్యంతో అద్దెకు ఇవ్వబడును. బ్యాంక్‌లకు గాని & ఆఫీసులకు గాని అనుకూలం. (లిఫ్ట్ సౌకర్యం కలదు) ✆ 98498 15569.

SECONDS SALE

శ్రీ బాలాజీ ట్రేడర్స్ పాత డబుల్ కాట్, ఫర్నీచర్, బీరువాలు, A/C లు, ఫ్రిజ్‌లు, కంప్యూటర్స్, బ్యాటరీలు, పాత కలప దర్వాజాలు, మోటర్లు, ఐరన్ గ్రిల్స్ కొనబడును, అమ్మబడును. ✆ 98488 37259.

JOBS

Wanted Delivery Boys License Compul Att. Salary & Incentives Call: 8347000115 To 119 Starwhites Logistics.

Female సేల్స్ ప్రమోటర్స్, Benzcircleలో Home అప్లయన్సెస్ షోరూంకు కావలెను. జీతం: 8 to 12,000, Age: Below 30 Y, Inter. ✆ 73311 73685.

Wanted Marketing Executives , Tally, Accountent with 2Y Exp. Q: Degree. Nunna. ✆ 0866-2854755.

Wanted English Teacher for Classes upto 5th. Salary: 10K - 12K. Whatsapp Biodata/Call 94405 79922. Abhyasa Vidyalayam, Gunadala, VJA.

Leading Digital Education Company Requires Marketing Managers @ Vijayawada. Qua: any Graduation Onrolls Job. CTC -30K, Call: 86883 56788/ mrdhr4@gmail.com

Wanted Female for Table Work in Whole Sale Footwear Shop. Q: Inter/ Degree Deepak Footwear, Hanumanpet, VJA. ✆ 92472 72321.

Wanted English, PS, NS Teachers for High School. Contact: Tummala Ratna Sai Ushodaya School, Gudivada. ✆ 95818 16789.

MBA/ MCA/ B.Tech (All) Accountant/ Admin/ Stores/ Counsellor/ Collection/ Showroom-Exe/ Front Office Sal: 7 to 20K ✆ 0866-6641333.

Wanted Female Receptionist with Degree, ITI (Electrical) 1 Year Experienced or Freshers. Cont: 87901 72501, 97003 33109.

Wanted Accountants with 5+ Yrs Exp in Construction Industry to work in Bhadrachalam, Anuppur (MP), Korba (CG) ★ walk-in from 10 AM - 6 PM @Cis Cons Pvt, Ltd., ★ KP Nagar, Plot No:39, Near Stella College, VJA. ✆ 0866 - 2493399.

Wanted Part / Full time IELTS & PTE Faculty. Qly: Excellent Communications skills in English. ✆ 95333 83853.

Wanted Lady Telecallers for Idea Cellular Ltd. Computer knowledge & Mobile must Interview: 28-08-17, 11-3 PM. ✆ 70959 01689.

Wanted Customer Service Officer in MNC Company. Qly: Inter (or) Degree Min 1 Yr. Exp + Computer Knowledge. ✆ 89777 50666.

మీ ఇంటివద్దనే ఉంటూ రికార్డ్స్ రైటింగ్ వర్క్స్ రాస్తూ అధికంగా సంపాదించుకోండి. వారంవారం పేమెంట్స్. Qul: 10th+ VJA. ✆ 79938 21967, 88977 64285.

బ్యాంకు అనుబంధ సంస్థలో పని॥ డేటా ఎంట్రీ అ॥ 10K, సాఫ్ట్‌వేర్ కం.లో H.R Fre./ Exp. 10 to 20K., ఫ్రంట్ ఆఫీస్ - 12K, S/W డెవలపర్స్ M.C.A, B.Tech (All) - 15K, అకౌంటెంట్స్ - 20K, హౌస్ కీపింగ్, సూ॥వై॥ ✆ 95058 38531.

రిటైర్డ్ ఉద్యోగులకు మాత్రమే (M/F) నెలకు: 30 వేలు సంపాదించుకునే అవకాశం. గవర్నమెంట్ / ప్రైవేటు ఉద్యోగులకు (SA సమద్) ✆ 93476 75051/ 96187 36689.

నందిగామలో జాబ్‌చేయుటకు 10th, ఇంటర్, ITI, డిగ్రీ పాస్/ ఫెయిల్ 17 to 28 సం॥లోపు గల యువకులు కావలెను. ఎటువంటి ఫీజు ఉండదు. ✆ 77024 84741.

ఉచిత శిక్షణ & ఉపాధి కేంద్రం: MEPMA ఆధ్వర్యంలో Tally, MS Office, Typing, PD కోర్సులలో ఉచిత శిక్షణ. బెంజిసర్కిల్, విజయవాడ. ✆ 0866 - 6666334, 73311 23828.

శ్రీరామ్ ఫైనాన్షియల్ ప్రోడక్ట్స్ సొల్యూషన్స్ ప్రై.లి. వారికి కృష్ణా జిల్లాలోని అన్ని మండలాలలో పనిచేయుటకు డెవలప్‌మెంట్ ఆఫీసర్లు కావలెను. అర్హత: అవసరంలేదు. వయస్సు: 30 సం॥లపైన, జీతం: 5 వేల నుండి 40 వేల వరకు + కమీషన్ + ఇన్సెంటివ్స్ + ఫారిన్ ట్రిప్స్ + గిఫ్ట్స్. పోస్టల్, LIC ఏజంట్లు, వ్యాపారస్థులు, గృహిణులు, రిటైర్డ్ ఉద్యోగస్థులకు ప్రాధాన్యత. Walk in Monday. ✆ 98498 24080, 98498 06334.

Medplus మెడికల్ షాపులలో Pharmacistగా పనిచేయుటకు D/B Pharmacy చదివినవారు మరియు SSC పాసైనవారు ఫార్మసీ అసిస్టెంట్స్‌గా పనిచేయుటకు ఆసక్తి కలవారు కావలెను. Ph: 8498064201, 7660005077.

1500 లకే డి.టి.పి, ఫొటోషాప్ ఇంటర్‌నెట్ టైపింగ్ కోర్సులు నేర్పించి 10,000/-ల ఉద్యోగం ఇప్పించబడును. Contact: 99851 53399.

VJA సిప్రో బిల్డింగ్ సిస్టమ్స్ ప్రై॥లి నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌గా MBA (ఫ్రెషర్స్) Exp 2 వీలర్ గలవారు కావలెను. ఆకర్షణీయ జీతం. ✆ 88855 73566.

ప్రముఖ స్లిమ్మింగ్ కంపెనీ విజయవాడ బ్రాంచి కొరకు సేల్స్ కౌన్సిలర్ కావలెను. మంచి జీతం+ ఆకర్షణీయమైన ఇన్సెంటివ్స్. సంప్ర: ✆ 8247207574.

సింగ్‌పూర్, సైప్రెస్, పోలెండ్, మలేషియా మరియు గల్ఫ్ దేశాలలో ఉద్యోగావకాశాలు కలవు. ఆకర్షణీయమైన జీతం+ వసతి. ✆ 93931 50055, 93932 50055.

బీసెంట్‌రోడ్ దగ్గర గల టెక్స్‌టైల్ షోరూమ్‌లో పనిచేయుటకు అనుభవం గల క్యాషియర్ కావలెను. వ: 25 Yr + టైమింగ్స్: 10 AM - 9.30 PM లోకల్ వారు మాత్రమే. ✆ 99661 32223.

ప్రముఖ ఆటోమొబైల్ ఫైనాన్స్ కం.లో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ (2 వీలర్, 4 వీలర్ బిజినెస్ కోసం) అ: డిగ్రీ విత్ 2 వీలర్ కలిగి ఉండాలి. సంప్ర: కీర్తి ఫైనాన్స్, 1వ లైను, భావాజీపేట, విజయవాడ-3. సంప్ర: 91330 25777, 92469 22778.

డాటా ఎంట్రీ వర్క్స్. కంప్యూటర్ ఉన్నవారికి పార్ట్/ ఫుల్‌టైం పేజ్ టైపింగ్ వర్క్స్ కలవు. నెలకు 8K-16K సంపాదించే అవకాశం. పేజ్‌కు రూ॥ 80/-. సంప్ర॥ 8523087027.

విజయవాడలో ప్రముఖ యాడ్ ఏజన్సీలో బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు డిగ్రీ చదివి టూవీలర్ కలిగిన 25 సం॥లోపు యువకులు కావలెను. జీతం: 8000 + TA + DA. సం॥ 94914 14477.

MARKETING / SALES

Travancore Ayurveda Urgently Looking for Experienced Marketing Executive, 2 Wheler Must. Ph: 9703577763. Email: info@travancoreayurveda.com

TOURS & TRAVELS

కావేరి పుష్కరాలు, మొదటి రోజు శ్రీరంగపట్నంలో స్నానమాచరించే 20 క్షేత్రాలు గోవా & కర్ణాటక AC యాత్ర Sep 4న & రామేశ్వరం 30 క్షేత్రాలు AC యాత్ర Sep 15న, దసరాకి Sep 26న పూరి 5 రో॥యాత్ర లక్ష్మీటూర్స్. ✆ 98662 46466.

కాశీయాత్ర, కాశీ, ప్రయాగ, నైమిషారణ్యం, గయ 9రో॥వ॥భో॥ 6000/- Oct-2 రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, కంచి 8రో॥ 6200/-వ॥భో॥ 7-9&20-9. సత్యసాయి సేవాసమాజ్ 7674806567



నేటి నుంచి పశు వ్యాధుల నిర్ధరణపై శిక్షణ

గన్నవరం, న్యూస్‌టుడే : పశు వ్యాధులు, నిర్ధారణపై ఈ నెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు గన్నవరంలోని ఎన్టీఆర్ పశువైద్య కళాశాలలో రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ వి.వైకుంఠరావు తెలిపారు. స్థానిక కళాశాల పశు చికిత్స సముదాయ ప్రాంగణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మానవుల్లో తరహాలో పశువుల్లోనూ అనేక రకాల వ్యాధులు సంభవిస్తున్నాయని చెప్పారు. జీర్ణకోశ, శ్వాస కోశ, గుండె జబ్బులు, మూత్రపిండాలు, కాలేయ వ్యాధులను నిర్ధారించే పరీక్షలపై పశువైద్యులు, పశువైద్య విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం బోర్డు సభ్యులు డాక్టర్ ప్రొఫెసర్ జగదీశ్వరరావు, ఎన్టీఆర్ పశువైద్య సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సంయుక్త సంచాలకులు డాక్టర్ సూర్యకుమార్ కార్యక్రమానికి వస్తున్నారని తెలిపారు.

రేపు తెలుగు భాషపై కవి సమ్మేళనం

సత్యనారాయణపురం,న్యూస్‌టుడే : తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని విశ్వమాతా ఛారిటబుల్ ట్రస్టు, గాయత్రి సొసైటీల ఆధ్వర్యంలో ఈనెల 29వ తేదీన సత్యనారాయణపురంలోని గాయత్రి కన్వెన్షన్ హాలులో 108 మంది కవులచే తెలుగుతల్లికి కవితార్చన, కవిసమ్మేళనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రచయిత వలివేటి శివరామకృష్ణమూర్తి తెలిపారు. ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన కవులు తమ కవితలు వినిపిస్తారన్నారు. తెలుగుభాషా వైభవం, తెలుగు సంస్కృతీ వైభవం, తెలుగు పండగ, ప్రసిద్ధ తెలుగుకవి, తెలుగు ప్రాంతాలలో చారిత్రక నేపథ్యం ఉన్న పట్టణం.. ఈ ఐదు అంశాలపైన కవితలు వినిపిస్తారని తెలిపారు. సాయంత్రం కవులకు అభినందన సభ ఉంటుందని ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీగేయ రచయిత వెన్నెలకంటి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

గిడుగు జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కృష్ణలంక, న్యూస్‌టుడే: వాడుక భాష జాతి జనుల జీవన భాష అని ఎలుగెత్తి చాటిన వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అమలు కావడం లేదని, అమలుపై ప్రభుత్వం దృష్టి సారించాలని రాష్ట్ర భాషోద్యమ సంస్థ గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, అధ్యక్షుడు కొండయ్యలు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి తరహాలో గిడుగు జయంతిని కూడా నిర్వహించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. అదే విధంగా తెలుగు పీఠాన్ని, తెలుగు విశ్వవిద్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాల్సిందిగా కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి ప్రకాశ్ జావ్‌దేకర్, భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడులను కోరనున్నట్లు చెప్పారు. త్వరలో దిల్లీ వెళ్లి తెలుగుపీఠం, విశ్వవిద్యాలయాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించేలా కృషి చేయనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్‌ఐటీలో స్వచ్ఛభారత్

నూజివీడు, న్యూస్‌టుడే : నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం అధికారి అక్కినేని సత్య శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రమదానం చేశారు. గత



పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ఆరు ఆదివారాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రాంగణంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. సంచాలకులు ఆచార్య వీరంకి వెంకటదాసు మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం పట్టు విడవకుండా విద్యార్థులు శ్రమదానం చేయడం అభినందనీయం అన్నారు. ఇతరులకు ఆదర్శ ప్రాయమని అన్నారు. పరిపాలనాధికారి రమాకాంత్ మాట్లాడుతూ.. ఇదే స్ఫూర్తితో స్వచ్ఛభారత్‌ను కొనసాగించాలని, తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. పీఆర్వో సురేష్‌బాబు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

పట్నంబజారు, న్యూస్‌టుడే: బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. ఆదివారం పాతగుంటూరులోని బాదినేడి బ్రహ్మయ్య కళ్యాణ మండపంలో బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశానికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు కావస్తున్నా బి.సి.లు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకంజలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 56 శాతం ఉన్నా ఏ ఒక్క రాజకీయ పార్టీ సీట్లు కేటాయించలేదన్నారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 14 లక్షలు, రాష్ట్రంలో ఉన్న లక్ష ఉద్యోగాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. అన్ని నియోజకవర్గాలు, మండల, గ్రామ స్థాయిల్లో బి.సి. సంఘాలతో సమావేశాలు నిర్వహించి భవిష్యత్తు కార్యచరణపై తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కొద్దిరోజుల్లో విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, గుంటూరుల్లో బహిరంగసభలు నిర్వహించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. బి.సి.లకు అన్యాయం జరుగకుండా కాపుల్ని బి.సి.ల్లో చేర్చటం సరైన విధానం కాదన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వాలు బి.సి.ల ఓట్లతో అగ్రవర్ణాలు సీట్లు గెలుచుకొంటున్నాయన్నారు. భవిష్యత్తులో బీసీలంతా కలిసి రాజకీయ పార్టీ ఏర్పాటు చేసే విషయంపై చర్చించనున్నట్లు ఆయన వివరించారు. బి.సి.లకు తగిన న్యాయం చేయకపోతే అంతా కలిసి ఉద్యమాలు చేపడతామన్నారు. కాపులను బి.సి.ల్లో చేర్చే విషయం సాంకేతిక పరమైన అంశమని, ఇది రాజకీయ నిర్ణయం కాదని, దీనిపై ఏకపక్ష నిర్ణయం తీసుకోవటం సరైన విధానం కాదన్నారు. జాతీయ బి.సి. కమిషన్‌కు రాజ్యాంగ బద్ధ హోదా కల్పించటం పట్ల ప్రధాని మోదీకి ఆయన అభినందనలు తెలిపారు. బి.సి. సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు మాట్లాడుతూ కాపులు విద్య, వ్యవసాయం, సినీరంగాల్లో ఆర్థికంగా నిలదొక్కుకున్నారని, కాపుల్ని బి.సి.ల్లో చేర్చే విషయం సరైన విధానం కాదన్నారు. కాపుల్ని బి.సి.ల్లో చేర్చే విషయంపై తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అవసరమైతే ప్రాణత్యాగానికైన సిద్ధమన్నారు. రాజకీయ లబ్ధి కోసం కాపుల్ని బి.సి.ల్లో చేర్చేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈడే మురళీకృష్ణ, అంగిరేకుల ఆదిశేషు, కుమ్మర క్రాంతి కుమార్, మారగాని నాగేశ్వరరావు, దేవరాజు సుబ్రమణ్యం, కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురువంటే.. ఆయనే!

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా గోరంట్ల | **అంతకుముందు 67 అవార్డులు కైవసం**

గురువుకు పర్యాయంగా నిలిచిన ఆయన.. విద్యాభివృద్ధికి తన జీవితాన్ని అంకితం చేశారు. ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు అంటే ఎవరికీ తీసిపోరని నిరూపించారు. తాను పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థుల ఉన్నతికి అహర్నిశలు శ్రమించడమే కాకుండా... ఆయా పాఠశాలలను ఉన్నత స్థానాల్లో నిలబెట్టారు. మొన్నటి వరకు పనిచేసిన బీకేపాలెం పాఠశాలను ఏకంగా జాతీయ స్థాయిలో స్వచ్ఛ పాఠశాల నిలిపారు. సెప్టెంబరు 5వ తేదీన దిల్లీలో ఆ పాఠశాలకు స్వచ్ఛ పురస్కారం దక్కనుండగా.. ఇప్పుడు ఆయన అదే వేదికపై రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ చేతుల మీదుగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకోనున్నారు.

కాకుమాను, న్యూస్‌టుడే



కాకుమాను మండలం బీకే పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన గోరంట్ల శ్రీనివాసరావు జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్రంలో ఆరు గురు ఉపాధ్యాయులు ఈ పురస్కారం దక్కించుకోగా, అందులో మొదటి స్థానంలో శ్రీనివాసరావు నిలిచారు. పొన్నూరు మండలం నిడుబ్రోలు రైలుపేటకు చెందిన గోరంట్ల శ్రీనివాసరావు బీఎస్సీ డిగ్రీ పట్టాతో పాటు రెండు ఎంఏలు, ఎంఈడీ, ఎంఫిల్ చేశారు. 1989 సంవత్సరంలో ఉపాధ్యాయుడుగా ఉద్యోగంలో చేరారు. నాటి నుంచి అనేక పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు, సౌకర్యాలు కల్పించి, ప్రైవేటు స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారు. ఆయన అంతకుముందు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో 67 అవార్డులు కైవసం చేసుకున్నారు. ముగ్గురు విద్యాశాఖ మంత్రులు, కలెక్టర్ల చేతుల మీదుగా లెక్కలేనన్ని అవార్డులు అందుకొని, మార్వెలెస్ బుక్ ఆఫ్ ఇండియా పుస్తకంలో స్థానం దక్కించుకున్నారు. ఈదులపల్లి, కోమలి, వంగిపురం, యనమదల, కాకుమాను మండలం బీకేపాలెంలలో పనిచేశారు. బీకేపాలెం పాఠశాలను ఎంతో అభివృద్ధి చేసినందుకుగాను ఆయనకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం గమనార్హం.

సౌత్ జోన్ సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్‌కు రాష్ట్ర జట్లు





ఎంపికైన రాష్ట్ర మహిళల, పురుషుల జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా సెపక్ తక్రా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీ నుంచి మూడు రోజుల పాటు విజయవాడలోని దండమూడి రాజగోపాలరావు నగరపాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే 5వ దక్షిణ భారత అంతర్ రాష్ట్ర సీనియర్ సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే రాష్ట్ర జట్లను ఆదివారం ఛాంపియన్‌షిప్ కార్యనిర్వాహక కార్యదర్శి సింహాద్రి రమేష్ వెల్లడించారు. స్థానిక ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో గత రెండు వారాలుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం ఆదివారం ముగియడంతో తుది జట్టును ప్రకటించారు. రాష్ట్ర జట్లకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి.

పురుషుల జట్టులో బి.రమేష్‌బాబు(కెప్టెన్, కర్నూలు), సి.అశోక్‌కుమార్, ఎస్‌కే మాలిక్ బాషా, సి.శివకుమార్, ఎం.అమృత్(కర్నూలు), ఎన్.మధు, ఎస్.అశోక్‌బాబు (ప్రకాశం), దినేష్, సతీష్, ప్రభు, పి.సుజన్ చౌదరి(కృష్ణా), సాయిదుర్గాప్రసాద్ (తూర్పుగోదావరి), సీహెచ్ సతీష్(పశ్చిమ గోదావరి), తారకేశ్వరరావు (శ్రీకాకుళం), లలిత్ కిషోర్ (చిత్తూరు)లు ఎంపికయ్యారు.

మహిళల జట్టులో యమున (కెప్టెన్, కృష్ణా), భవాని, రాజ్‌కుమారి, హసీనా, శ్రీవాణి (కృష్ణా), అపర్ణ, మల్లేశ్వరి, తులసి (కర్నూలు), షబానా, గౌసియా (గుంటూరు), ప్రశాంతి, ఝాన్సీ (శ్రీకాకుళం), మాధవి (నెల్లూరు), జోత్స్న (విశాఖపట్నం), సాత్విక (పశ్చిమ గోదావరి)లు ఎంపికయ్యారు.

ఛాంపియన్‌షిప్‌కు సర్వం సిద్ధం

విజయవాడ క్రీడలు: జిల్లా సెపక్ తక్రా సంఘం ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే 5వ దక్షిణ భారత అంతర్ రాష్ట్ర సీనియర్ స్త్రీ, పురుషుల సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్‌కు సర్వం సిద్ధం చేశారు. స్థానిక డీఆర్ఆర్ ఎంసీ ఇండోర్ స్టేడియంలో ఛాంపియన్‌షిప్ నిర్వహణకు మూడు కోర్టులను ఏర్పాటు చేశారు. నవ్యాంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతమైన విజయవాడ నగరంలో తొలిసారిగా నిర్వహిస్తున్న దక్షిణ భారత సెపక్ తక్రా ఛాంపియన్‌షిప్‌ను ఇండోర్ స్టేడియంలో మ్యాట్‌లపై నిర్వహించడం జరుగుతుందని ఛాంపియన్‌షిప్ కార్యనిర్వాహక కార్యదర్శి సింహాద్రి రమేష్ తెలిపారు. ఛాంపియన్‌షిప్‌లో దక్షిణ భారత దేశంలోని అయిదు రాష్ట్రాలతో పాటు రెండు కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన జట్లలో ఆదివారం నాటికి పలు జట్లు విచ్చేశాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించే ఈ ఛాంపియన్‌షిప్ ప్రతి రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటలకు సాగుతాయి. ఛాంపియన్‌షిప్‌లో తలపడే క్రీడాకారులు, క్రీడాధికారులకు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పించారు. సోమవారం ఉదయం జరిగే ఛాంపియన్‌షిప్ ప్రారంభ సభకు రాష్ట్ర క్రీడా మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్యఅతిథిగా, మేయరు కోనేరు శ్రీధర్ అధ్యక్షులుగా పాల్గొనున్నారు.

ప్రదర్శనలతో పశు సంపదకు ప్రోత్సాహం

ఒంగోలు జాతి ఎడ్ల పోటీలో వక్తలు

గ్రామీణ ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: పోటీ ప్రదర్శనలతో ఒంగోలు జాతి పశు సంపదకు ప్రోత్సాహం ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే రావెల కిశోర్‌బాబు అన్నారు. ఎన్టీ ఆర్ మెమోరియల్ ఆధ్వర్యంలో ప్రత్తిపాడులోని కాకాని వెంకట్రామయ్య క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి ఎడ్ల ప్రదర్శన పోటీలు ఆదివారం మూడో రోజుకు చేరుకున్నాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే రావెల కిశోర్‌బాబు వ్యవసాయ విభాగంలో ప్రదర్శన పోటీలను ప్రారంభించి, రెండు పళ్ల విభాగంలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు అందించారు. ఈ నగదును గుంటూరు, కొత్తపేటకు చెందిన జి. ప్రసాద్‌బాబు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అనిల్‌చౌదరి (సిద్ధాంతి), తెదేపా నాయకులు జి.వెంకటేశ్వరరావు, వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడికి చెందిన ఎం.మల్లేశ్వరరావు, ప్రత్తిపాడు వాసి కె.వెంకట్రామయ్య జ్ఞాపకార్థం కుమారుడు కె.సురేష్ బాబు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సి.శ్రీనివాసరావు, జడ్పీటీసీ సభ్యులు డి.భాగ్యారావు, తెదేపా మండల అధ్యక్షులు శివరామప్రసాదు హాజరయ్యారు.

4 పళ్ల విభాగంలో కృష్ణా ప్రథమం : నాలుగు పళ్ల విభాగం పోటీల్లో. కృష్ణా జిల్లా ఘంటసాల మండలం, దావిపర్రు గ్రామానికి చెందిన కోటేశ్వరరావు ఎడ్ల జత ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో సదా ఆంజనేయ గౌడ్ ఎడ్ల జత ప్యాపిలీ మండలం, కర్నూలు జిల్లా), మూడో స్థానంలో వట్టికాలు భార్గవ్ చౌదరి ఎడ్లజత (లింగాపురం గ్రామం, అమరావతి మండలం, గుంటూరు), నాలుగు మారెళ్ల మోక్షారెడ్డి ఎడ్లజత రాజుపాలెం మండలం, కడప), అయిదో స్థానంలో రాజీవ్ ఎడ్లజత (మెట్లపలి గ్రామం, గన్నవరం నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

6 పళ్ల విభాగంలో గుంటూరుకు మొదటి స్థానం: 6 పళ్ల విభాగం పోటీలో మొత్తం 11 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నవలూరు గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచినట్లు నిర్వాహకులు పమిడి అంజయ్య చౌదరి, సొసైటీ అధ్యక్షులు కాకాని సురేష్ బాబు చెప్పారు. రెండో స్థానంలో సూర్యపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి ఎడ్ల జత నిలిచింది. తృతీయ స్థానంలో మేకా కృష్ణమోహన్, వేమూరి మౌర్య చంద్ర ఎడ్లజత (ఘంటసాల, కృష్ణా), నాలుగో స్థానంలో రామారావు ఎడ్ల జత పర్చూరు మండలం, ప్రకాశం), అయిదో స్థానంలో మోజాల వెంకట దుర్గారావు ఎడ్ల జత (పెట్రువారిపాలెం గ్రామం, నర్సరావుపేట, గుంటూరు) నిలిచాయని వివరించారు.



అర్జున్‌రెడ్డి.. శకుంతల, శైలజ, సౌమ్య, నీలిమ, స్వర్ణలక్ష్మి (పాయకాపురం), రాంగోపాల్, దుర్గామహల్, వెంకటకృష్ణ (పోరంకి), రామచంద్ర (కంకిపాడు), వెంకటేశ్వర డీలక్స్ (ఇబ్రహీంపట్నం)

వివేకం.. అలంకార్, స్వాతి, శ్రీనివాసమహల్, రాఘవేంద్ర, వినాయక్, విజయలక్ష్మి (కానూరు), విజయలక్ష్మి (కంకిపాడు), శివకృష్ణ (కొండపల్లి),

వి.ఐ.పి. -2.. జయరాం, వెంకటస్వర్ణ ప్యాలెస్, శ్రీనివాస (పోరంకి), **లై..** స్వర్ణాప్యాలెస్, **ఆనందో బ్రహ్మ..** వెంకటేశ్వర ప్యాలస్, రాజకుమారి, రామకృష్ణ, **Annabelle, A Gentleman..** నవరంగ్, **మాయామాల్,,** కళ్యాణచక్రవర్తి, **నేనే రాజు నేనే మంత్రి..** అన్నపూర్ణ, శ్రీచంద్ర (కంకిపాడు), **జయ జానకి నాయక..** అప్సర, వెంకటేశ్వర డీలక్స్ (పాయకాపురం), బాలాజీ (ఇబ్రహీంపట్నం), **ఫిదా..** కపర్థి, **వివేకం, ఆనందో బ్రహ్మ..** బాలాజీ సినీవిల్లా (పోరంకి),

రవీంద్రసినిమాస్ (పాయకాపురం): వివేకం, అర్జున్‌రెడ్డి, వి.ఐ.ఇపి.-2, నేనేరాజు నేనే మంత్రి, ఆనందో బ్రహ్మ

జి3 - రాజ్, యువరాజ్: అర్జున్‌రెడ్డి, వివేకం, వి.ఐ.పి.-2, ఆనందో బ్రహ్మ,

మీరాజ్ సినిమాస్ (గాంధీనగర్): అర్జున్‌రెడ్డి, వి.ఐ.పి.-2, వివేకం

సినీ పోలీస్ (PVP) (యం.జి. రోడ్): వివేకం, అర్జున్‌రెడ్డి, ఆనందోబ్రహ్మ, వి.ఐ.పి.-2, నేనేరాజు, నేనేమంత్రి, ఫిదా, జయ జానకి నాయక, Annabelle తెలుగు, A Gentleman.. (హిందీ)

క్యాపిటల్ సినిమాస్ (బెంజిసర్కిల్): A Gentleman.. (హిందీ), ఆనందోబ్రహ్మ, Annabelle (తెలుగు) అర్జున్‌రెడ్డి, Dark Tower, **ఫిదా, నేనే రాజు నేనే మంత్రి, Quidi Band (హిందీ), వి.ఐ.పి.-2, వివేకం,**

Y. Screens: (బస్టాండ్): అర్జున్‌రెడ్డి, వి.ఐ.పి.-2, వివేకం, ఆనందో బ్రహ్మ

రాష్ట్ర నూర్ బాషా యువజన విభాగం కొత్త కార్యవర్గం ఎన్నిక

గాంధీనగర్(విజయవాడ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్ బాషా, దూదేకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం యువజన విభాగం కొత్త కార్యవర్గం ఎన్నిక ఆదివారం ప్రెస్ క్లబ్‌లో జరిగింది. యువజన అధ్యక్షుడిగా డి.పి.మస్తాన్, గౌరవాధ్యక్షుడిగా షేక్ చాన్ భాషా, ప్రధాన కార్యదర్శిగా మౌలాలి, కోశాధికారిగా షేక్ షకీర్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడు చాన్ బాషా మాటాడుతూ ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్న నూర్‌భాషాలకు అన్ని పార్టీలు ప్రాధాన్యత కల్పించకపోవడం విచారకరమని రానున్న ఎన్నికల్లో చట్టసభల్లో స్థానం కల్పించాలని కోరారు. ముఖ్యఅతిథిగా విచ్చేసి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ నాగుల్‌మీరా మాట్లాడుతూ నూర్ బాషా కులస్తులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు తెదేపా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా షేక్ షకార్, కార్యదర్శిగా షేక్ కరీముల్లాను ఎన్నుకున్నారు. సంఘం నాయకులు పీర్‌మ్మిద్, సుభాన్, కె.బాబూలాల్ పాల్గొన్నారు.

హోరాహోరీ పోరులో

సీబీపీదే స్మారక ట్రోఫీ



శాప్ ఓఎస్‌డీ పి.రామకృష్ణ నుంచి ట్రోఫీ అందుకున్న విజేత జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: హోరా హోరీగా సాగిన తుది పోరులో సీబీపీ 'ఎ' జట్టు స్మారక ట్రోఫీని కైవసం చేసుకుంది. సిటీ బాస్కెట్ బాల్ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో నిర్వహించిన పి.ఆదిబాబు, ఎ.నజీర్ స్మారక బాస్కెట్ బాల్ టోర్నీ ఫైనల్ మ్యాచ్ ఫ్లడ్ లైట్ల కాంతుల్లో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. ఈ మ్యాచ్‌లో బంతిని ఒకరికి చిక్కకుండా మరొకరు వేగంగా బాస్కెట్‌లో వేసేందుకు ఇరు జట్ల క్రీడాకారులు తీవ్రంగా కృషి చేశారు. వేగవంతమైన డ్రిబ్లింగ్, పాసింగ్, పివోట్ షూట్లతో పాయింట్లు సాధించి స్కోర్ బోర్డును పరుగులెత్తిస్తూ ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య ఉత్సాహంగా సాగింది.

* లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో జరిగిన టోర్నీలో సీబీపీ 'ఎ', నూజివీడు-2, సీబీపీ 'సి', వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల, సీబీపీ 'బి', నూజివీడు-1, ఆంధ్రా లయోలా కళాశాల, పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల జట్లు లీగ్ దశలో తొలి రెండు స్థానాల్లో నిలిచి నాకౌట్‌కు చేరుకున్నాయి. అనంతరం జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో సీబీపీ 'ఎ' జట్టు 41-23 స్కోర్ తేడాతో సీబీపీ 'సి' జట్టుపై, నూజివీడు-2 జట్టు 37-24 స్కోర్ తేడాతో వీఆర్ సిద్ధార్థ జట్టుపై, సీబీపీ 'బి' జట్టు 43-28 స్కోర్ తేడాతో నూజివీడు-1 జట్టుపై, ఆంధ్రా లయోలా కళాశాల జట్టు 27-13 స్కోర్ తేడాతో పీవీపీ సిద్ధార్థ జట్టుపై విజయం సాధించాయి. సెమీ ఫైనల్స్‌లో ఆంధ్రా లయోలా జట్టు 60-35 స్కోర్ తేడాతో నూజివీడు-2 జట్టుపై, సీబీపీ 'ఎ' జట్టు 42-41 స్కోర్ తేడాతో సీబీపీ 'బి' జట్టుపై విజయం సాధించి ఫైనల్‌లో ప్రవేశించాయి. తృతీయ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో సీబీపీ 'బి' జట్టు 67-59 స్కోర్ తేడాతో నూజివీడు-2 జట్టుపై గెలుపొందింది. ఫైనల్ మ్యాచ్‌లో సీబీపీ 'ఎ' జట్టు 43-33 స్కోర్ తేడాతో ఆంధ్రా లయోలా కళాశాల జట్టుపై విజయం సాధించి స్మారక ట్రోఫీని కైవసం చేసుకుంది. టోర్నీలో ఆంధ్రా లయోలా కళాశాలకు చెందిన జి.వేణుగోపాల్‌రెడ్డి, ఉల్లాస్ ఉత్తమ క్రీడాకారులుగా ప్రత్యేక బహుమతులను సొంతం చేసుకున్నారు. ఆదివారం రాత్రి జరిగిన ముగింపు కార్యక్రమానికి శాప్ ఓఎస్‌డీ పి.రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. జిల్లా బాస్కెట్ బాల్ సంఘం అధ్యక్షుడు జీఎస్‌సీ బోసు, కార్యదర్శి బొబ్బిలి కొండలరావు, స్వర్గీయ పి.ఆదిబాబు సతీమణి సునీత అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో సిటీ బాస్కెట్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి జి.ప్రేమకుమార్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు వి.రాజ్‌కుమార్, ఎ.ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి జిల్లా స్కూల్ గేమ్స్ క్రీడా జట్ల ఎంపిక

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య (అండర్-14, 17) ఆధ్వర్యంలో వచ్చే నెల ఒకటి నుంచి రెండు రోజుల పాటు పలు క్రీడాంశాల్లో జిల్లా జట్లను ఎంపి చేస్తామని ఆ సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి కె.శకుంతల తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీన ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో అండర్-14, 17 బాలబాలికల త్రోబాల్, హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక, పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య నగరపాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపికలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈనెల 2వ తేదీన ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో అండర్-14, 17 బాలబాలికల జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే ఆసక్తిగల క్రీడాకారులు విద్యార్హత ధ్రువపత్రంతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ పత్రంలో సంబంధిత ప్రాంతాల్లో ఉదయం 9 గంటలకు హాజరవ్వాలని సూచించారు.

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు వాయిదా

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో నిర్వహించాల్సిన జిల్లా అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు అకాల వర్షం కారణంగా వాయిదా వేశామని ఆ సంఘం కార్యదర్శి ఎ.యల్లారావు తెలిపారు. తిరిగి ఈ ఎంపిక పోటీలు వచ్చే నెల 2వ తేదీన ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఎంపిక పోటీల సమయంలో వయసు ధ్రువీకరణ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు తెల్లటి క్రీడా దుస్తులు, సొంత కిట్, బంతితో హాజరవ్వాలని సూచించారు.

ఈ-పోస్ ద్వారా ఎరువులు విక్రయించకుంటే చర్యలు



సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ అధికారులు

పెనమలూరు, న్యూస్‌టుడే: ఈ-పోస్ ద్వారానే డీలర్లు రైతులకు ఎరువులను విక్రయించాలని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ నరసింహారావు తెలిపారు. ఆదివారం పోరంకి సాయిబాలాజీ కల్యాణ మండపంలో కృష్ణా జిల్లా ఎరువులు, పురుగు మందుల రిటైల్ డీలర్ల సమావేశం జరిగింది. నరసింహారావు మాట్లాడుతూ ఈ-పోస్ విధానం ద్వారా ఎరువులను విక్రయించడం ద్వారా భవిష్యత్‌లో రైతులకు అనేక ప్రయోజనాలు అందుబాటులోకి వస్తాయన్నారు. రైతులు తమ ఆధార్ సంఖ్యను తప్పనిసరిగా ఎరువుల విక్రయం సందర్భంగా నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ విధానం ద్వారా విక్రయించిన ఎరువులకే ప్రభుత్వం ఆయా కంపెనీలకు సబ్సిడీలను అందజేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ-పోస్ ద్వారా ఎరువులను విక్రయించని డీలర్లపై చర్యలు తీసుకొని వారి లైసెన్సులు రద్దుచేస్తామని జేడీ నరసింహారావు హెచ్చరించారు. ప్రముఖ ఆడిటర్ పి.లక్ష్మణరావు జీఎస్‌టీ విధానంపై పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ సునీల్‌కుమార్, పెనమలూరు ఏవో లంకా శ్రీనివాస్, రిటైల్ డీలర్ల సంఘ అధ్యక్షుడు కొత్తపల్లి విజయకుమార్ పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ పోటీలకు జిల్లా జట్లు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అధికారులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ రైఫిల్ షూటింగ్‌లో పాల్గొనే జిల్లా జట్లను ఆదివారం హనుమాన్‌పేటలోని గోకరాజు లైలా గంగరాజు రైఫిల్ షూటింగ్ రేంజ్‌లో ఎంపిక పోటీలు జరిగాయి. జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య(అండర్-14, 17) ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో నుంచి ప్రతిభగల క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశామని ఆ సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి కె.శకుంతలాదేవి తెలిపారు. ఎంపికైన జిల్లా అండర్-14 బాలబాలికల జట్లు కడపలో, అండర్-17 బాలబాలికల జట్లు అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ సమాఖ్య రైఫిల్ షూటింగ్ పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి.

అండర్-14 బాలుర విభాగంలో ఆర్.అర్చుల్‌సింగ్ (శ్రీశారదా రామకృష్ణ విద్యాలయం, విజయవాడ), ఎ.హర్షవర్దన్ (కృష్ణవేణి ఆంగ్లమాధ్యమ పాఠశాల, విజయవాడ), ఆర్.మహేష్ (నవోదయ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, విజయవాడ), బాలికల విభాగంలో జీతూ కౌర్ (శ్రీశారదా రామకృష్ణ విద్యాలయం, విజయవాడ)లు ఎంపికయ్యారు.

అండర్-17 బాలుర విభాగంలో ఎం.ఉమామహేష్, కేపీవీ శ్రీకర్(ఎన్‌ఎస్‌ఎం స్కూల్, విజయవాడ), ఎ.చరణ్‌తేజ (శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్, విజయవాడ), బాలికల విభాగంలో ఎస్‌కే చిన్ని(సెయింట్ ఆన్స్ స్కూల్, నూజివీడు), బి.పూజితాకీర్తి (భాష్యం స్కూల్, విజయవాడ), జె.స్రవంతి (నారాయణ స్కూల్, విజయవాడ)లు ఎంపికయ్యారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: మానసిక ఒత్తిడి తగ్గడానికి సోమవారం చేయాల్సిన దానాలు? ధూమ్ర వర్ణ గణపతిని పూజిస్తే వాస్తుదోషాలు పోతాయా? 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: బలరామకృష్ణులు (రాజశేఖర్, రమ్యకృష్ణ).

మధ్యాహ్నం

12-00: స్పెషల్ అభి'రుచి': ఘుమఘుమలు 'టమేటో పలావు', మీచేతివంట 'బజ్జీమిర్చికూర', 'వంకాయపల్లీకుర్మా', జస్ట్ ఎమినిట్ 'మిరియాలగారెలు' తయారు చేసే విధానం. ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00:వసంతం(డైలీ సీరియల్), 04-30: ఢీ 10 (రిపీట్), 06-00: శ్రీభాగవతం (భక్తిరసాత్మక దృశ్యకావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఆలీతో సరదాగా: నటి సితార, నటుడు రాజారవీంద్రలతో.., 10-30: సినీవారం: (స్పెషల్ ప్రోగ్రాం).

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 మైకేల్ మదన్ కామరాజు రిపీట్
01:15 ది బ్రేకప్ కన్సల్టెంట్ రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యో రామ రిపీట్
03:30 హంగామా రిపీట్
సాయంత్రం
04:30 నా షో నా ఇష్టం
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 ఈ-జంక్షన్
09:00 పటాస్
09:30 అల్లరే అల్లరి
10:00 సరదాగా కాసేపు
10:30 నా షో నా ఇష్టం రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
డా.ఈటీవీ – (ఉ.6:30, 11:00, మ.3:30, సా.7:30)
యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.5:00, రా.10:30)
అమృతం (ఉ.8:00, మ.12:30, రా.8:00)
హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా.8:30)
ఆరోగ్యమస్తు (ఉ.9:00, మ.03:00, సా.4:00, రా.9:00)
ఆయుష్ (ఉ.9:30)
లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ (ఉ.10:00)
అందరికి ఆరోగ్యం (ఉ.10:30)
విహారి (మ.12:00, సా.6:30, రా.10:00)
హెల్దీ డయాబెటిక్ - (మ.1:30)
జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (మ.2:00, రా.7:00)
బాడీ మైండ్ & సోల్– అంతరంగం (మ.2:30, రా.9:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మాయా మోహిని (నరసింహరాజు, స్మిత), 10-00: మార్నింగ్ షో: మాయదారి మరిది (సుమన్, మహాలక్ష్మి), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: అల్లుడుగారు (మోహన్‌బాబు, శోభన), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: కడపరెడ్డెమ్మ (శారద), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: సతీసావిత్రి (ఏఎన్నార్, ఎస్.వరలక్ష్మి), 10-00: సెకండ్‌షో: బంగారుకాపురం (కృష్ణ, జయప్రద).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - స్పినాచ్ బేసిల్ క్రేప్స్ & సొరకాయ తెలగపిండి రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ష్రింప్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ అండ్ చికెన్ పాస్తా సలాడ్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – తమిళ్ మసాలా వడ & గుమ్మడిపండు లడ్డు, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – బనానా చీజ్ పొర్రిడ్జ్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (డయాబెటిక్ రెసిపీ) – గ్రీన్ స్మూతీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - అటుకుల ఉప్మా & ఆలూ చిప్స్, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (తమిళనాడు క్యూసైన్) - కారమణి సుండల్ ఊతప్పం, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – షెజ్వాన్ టోఫు పరోటా, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - ఆపిల్ స్వీట్ బూంది, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - అవకాడో ఓట్స్ ఛాట్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (మెక్సికన్ స్పెషల్)– మెక్సికన్ ఫ్రైడ్ ఫిష్ & మెక్సికన్ చికెన్ బుర్రిటో, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - పైనాపిల్ రసం, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – యాపిల్ క్రంబుల్స్ కేక్ & స్పెషల్ ఎగ్ నూడిల్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – చిల్లి గార్లిక్ పొటాటోస్, మ.2.30: చోటా షెఫ్ – ఎగ్ సలాడ్, మ.3.30: అతిథి – మీ ఇంటింటి నేస్తం, మ.5.15: స్నాక్స్ - బొబ్బర్ల కుడుములు.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: సిద్ధి వినాయక ఆలయం, ఆస్టిన్ అమెరికా 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతీ!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ గణపతి పంచాయతన మందిరం, సాంగ్లీ, మహారాష్ట్ర, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 28-08-2017

SVBC: **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామ స్తోత్రం, 07-30 శ్రీవారిసేవలు (తోమాలసేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకు వేళాయే - శివుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 పంచారామాలు, 03-30 విష్ణుపురాణం, **సాయంత్రం:** 04-30 క్షేత్ర దర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ - తిరుమల + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + శివపంచాక్షరి + లింగాష్టకం, 08-00 భక్తిచైతన్యం, 08-30 ధర్మసోపానాలు - శ్రీ చాగంటి, 09-00 ఆలయ దర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవిసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనికపర్వం.

భక్తి TV: **ఉదయం:** 06-00 శ్రీ శివ సహస్రం, 06-30 నమకంచమకం, 07-00 అర్చన, 07-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 గణపతి దర్శనం, 08-30 జై..జై గణేశా (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 గణపతి దర్శనం, 05-00 శివస్తోత్రం, 05-30 శ్రీశివసహస్రం, 06-00 నమకంచమకం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 జై..జై గణేశా (లైవ్), 08-30 రామాయణ తరంగిణి, 09-00 మహాగణపతిం, 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు: **ఉదయం:** 07-30 ఓంకారం, 08-00 సినిమా: బుజ్జిగాడు, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: బలుపు.

మా: **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్‌బాస్, 02-30 బిగ్‌బాస్ రిపీట్, **సాయంత్రం:** 04-00 బిగ్‌బాస్ రిపీట్, 05-30 ఓకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్‌బాస్, 10-30 బిగ్‌బాస్ రిపీట్.

జెమిని: **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: జానకి వెడ్స్ శ్రీరామ్, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావు (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: జేమ్స్ బాండ్, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వునాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 సినిమా: నువ్వొస్తానంటే నేనొద్దంటానా.

HBO: **ఉదయం:** 06-00 జోనా హెక్స్, 07-03 స్పై కిడ్స్2: ఐలాండ్ ఆఫ్ లాస్ట్ డ్రీమ్, 08-55 చార్లీ అండ్ ది చాకొలెట్ ఫ్యాక్టరీ, 10-52 ది డార్క్‌నైట్, **మధ్యాహ్నం:** 01-23 ఐరన్ మ్యాన్ 3, 3-13 డీప్ బ్లూ సీ, **సాయంత్రం:** 05-00 ది ఎకౌంటెంట్, 06-56 జాక్ ది జియంట్ స్లేయర్, **రాత్రి:** 9-00 షావలిన్ సాకర్, 10-49 ది హ్యాంగ్ ఓవర్ పార్ట్ 2.

సుప్రీంకోర్టు న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలిపిన న్యాయవాదులు

విజయవాడ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి రమణ 60వ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం న్యాయవాదులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్.వి రమణ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు గోగుశెట్టి వెంకటేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది కనకమేడల రవీంద్రకుమార్, ఏపీ అడ్వకేట్ జనరల్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి రమణ దంపతులతో న్యాయవాదులు

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో దేవాదాయ శాఖ అధికారి

మోపిదేవి(అవనిగడ్డగ్రామీణ), న్యూస్‌టుడే: మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ సత్యనారాయణ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నాగపుట్టలో పాలుపోశారు. ఆలయ ఏసీ ఎం. శారదాకుమారి వారికి శేష వస్త్రాన్ని కప్పి స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.



సత్యనారాయణ దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఏసీ

బ్రాహ్మణుల సంక్షేమానికి కృషి

గాంధీనగర్, న్యూస్‌టుడే: బ్రాహ్మణ సామాజిక వర్గ అభ్యున్నతి, సంక్షేమం కోసం సంఘీయులంతా కృషి చేయాలని బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరాం అన్నారు. ఆదివారం హనుమాన్‌పేటలో జరిగిన బ్రాహ్మణ వధూ, వరుల పరిచయ వేదిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ బ్రాహ్మణ ఆచార వ్యవహారాలను సమాజం ఎప్పుడూ గమనిస్తూ ఉంటుందని ఈ విషయాన్ని సంఘీయులంతా గుర్తించి సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఎస్.ప్రభాకరరావు, టి.రామకృష్ణ, కాశీవిశ్వనాథం, మురళీకృష్ణ, కావూరి సూర్యనారాయణమూర్తి, గణపతి, సూర్యనాయణ శాస్త్రి పాల్గొన్నారు.

మద్దతు ధరకు పప్పు ధాన్యాలు కొనాల్సిందే

మంత్రి దేవినేని ఆదేశం

మైలవరం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా పండించిన పెసర, కంది వంటి పప్పుధాన్యాలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు ఇచ్చి కొనాల్సిందేనని జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆదేశించారు. మైలవరం మార్కెట్ యార్డులో రైతులు ఆరబెడుతున్న పెసలను ఆదివారం ఆయన పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెసలకు మద్దతు ధర రూ.5 వేలకు పైగా ఉంటే వ్యాపారులు మాత్రం రూ.4500 లోపే కొనుగోలు చేస్తున్నారని రైతులు ఫిర్యాదు చేశారు. యార్డు సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారని వివరించారు. మద్దతు ధర ఇవ్వకపోతే రైతులకు గిట్టుబాటు కాదని తెలిపారు. రైతుల నుంచి వివరాలు సేకరించిన ఆయన వెంటనే వ్యవసాయ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, సబ్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పప్పుధాన్యాలు పండిస్తున్న విస్తీర్ణంపై ఆరా తీశారు. కొనుగోలు ఎలా ఉందని ప్రశ్నించారు. దళారులు, మధ్య వ్యాపారుల తీరు సక్రమంగా లేకుండా అధికారులు ఏం చేస్తున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా 11 వేలకు పైగా ఎకరాల్లో పెసర పంట పండితే మార్క్‌ఫెడ్ ఎందుకు కొనడం లేదని డీడీని ప్రశ్నించారు. పలువురు ట్రేడర్లు మాఫియాగా ఏర్పడి, రైతుల కష్టాన్ని దోచుకుంటుంటే ఏం చేస్తున్నారని అడిగారు. పంట వేసిన విస్తీర్ణం నుంచి సుమారు 35 వేల క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని చెబుతున్నారని, ఆ దిగుబడులను ఆ మాత్రం కొనలేరా అని ప్రశ్నించారు. మంగళవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి మద్దతు ధరకు కొనాలని పప్పుల మిల్లుల నిర్వాహకులు, ట్రేడర్లకు ఆదేశాలివ్వాలని ఆదేశించారు. మార్కెట్ యార్డులో పట్టాలివ్వలేదని, రైతుల్ని లోపల ఉండనివ్వడం లేదని చేసిన ఫిర్యాదులపై యార్డు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుల్ని సరిదిద్దకపోతే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. సమావేశంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ సాంబశివరావు, నాయకులు పాల్గొన్నారు.



పెసలు కొనుగోలుపై ఆరా తీస్తున్న మంత్రి ఉమామహేశ్వరరావు

రుణమాఫీ చట్టం తెచ్చేందుకు పోరాటం

ప్రొద్దుటూరు(కంకిపాడు గ్రామీణం), న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా రుణమాఫీ చట్టం తెచ్చేందుకు పోరాటం చేయడానికి 156 రైతు సంఘాలతో కలిసి పోరాటం చేయడానికి సంకల్పించామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. ఆదివారం కంకిపాడు మండలంలో ప్రొద్దుటూరులోని జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పేరుకు రుణమాఫీ చేశానని చెబుతున్నారే కానీ అది రైతులకు వడ్డీకి కూడా పనికి రాలేదన్నారు. నందిగామ ప్రాంతంలోని రైతులకు 9.5 కోట్లు బకాయిలుంటే వాటిని చెల్లిస్తానన్న దేవినేని ఉమా ఇప్పటి వరకు వారి ముఖం కూడా చూడలేదన్నారు. పంచదార, పత్తి, మాంసం వంటి వాటిని దిగుమతి చేసుకోవడంతో రాష్ట్రంలోని 29 పంచదార మిల్లులు మూతపడడంతోపాటు ఈ ప్రాంతంలోని రైతులను వీధిన పడేసినట్లేనన్నారు. వెంకయ్యనాయుడుకు పౌరసన్మానం జరిగితే ఇక్కడ డ్వాక్రా, రేషన్‌డీలర్లు, పాఠశాల విద్యార్థులను ఎండలో నిలబెట్టమేంటని ప్రశ్నించారు. వచ్చే నెల 17న కంచికచర్ల నుంచి 156 రైతు సంఘాలతో పాదయాత్ర చేపట్టి విజయవాడ సిద్ధార్థలో బహిరంగ సభ నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి ఆర్.రఘు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.హరిబాబు, డివిజన్ కార్యదర్శి కె.శివనాగేంద్రం, మండల కార్యదర్శి పంచకర్ల రంగారావు, చౌటుపల్లి రవి, టి.నరేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యుత్ కోతతో అరగంటపాటు వేచి ఉన్న నాయకులు తాము సమావేశం నిర్వహిస్తున్నామని తెలిసే అధికార పార్టీ అండదండలతో విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ కోత విధించారని సీపీఎం నాయకులు విమర్శించారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు

7న చింతలపూడి ఎత్తిపోతలకు శంకుస్థాపన

మైలవరం, న్యూస్‌టుడే: జిల్లాకు గోదావరి జలాల తరలింపు నిమిత్తం నిర్మిస్తున్న చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులకు సెప్టెంబరు 7వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం మైలవరం మార్కెట్ యార్డులో ఆయన మాట్లాడుతూ రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ వద్ద ముఖ్యమంత్రి పైలాన్‌ను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. చింతలపూడి, గుడ్డిగూడెం రెండో దశ పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఎత్తిపోతల పథకాన్ని ఏడాదిలోనే పూర్తి చేసి గోదావరి జలాలను జిల్లాకు తేనున్నట్లు తెలిపారు. దాని ద్వారా జిల్లాలోని మైలవరం, తిరువూరు, నూజివీడు, గన్నవరం, నందిగామ నియోజకవర్గాలతో పాటు పశ్చిమ గోదావరి జిల్లాలోని మరో నాలుగు నియోజకవర్గాలకు సాగు నీరు అందుతుందని స్పష్టం చేశారు. మొత్తం 7 లక్షల ఎకరాలకు సాగునీరు, 25 లక్షల మంది ప్రజలకు తాగు నీరు అందుతుందని పేర్కొన్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: ఆంధ్ర హాస్పిటల్‌లోని హార్ట్, బ్రెయిన్ ఇనిస్టిట్యూట్‌లో హీలింగ్ లిటిల్ హార్ట్స్, యుకే ఛారిటీ సౌజన్యంతో ఆదివారం నుంచి సెప్టెంబరు 9 వరకు చిన్నారులకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ చీఫ్ ఆఫ్ చిల్డ్రన్స్ సర్వీసెస్, డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు అన్నారు. ఆదివారం నగరంలోని ఎంజీ రోడ్డులోని ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిన్నపిల్లలకు గుండె సంబంధిత వ్యాధులు, రంధ్రాలు పడటం, ఊపిరితిత్తుల్లోని రక్తనాళాలలో ఒత్తిడి అధికంగా ఉండడం, కొంత మందికి మూడు లేక నాలుగు సమస్యలతో బాధపడుతున్న క్లిష్టమైన వ్యాధులకు ఇంగ్లాండ్‌కు చెందిన ఏడుగురు వైద్యనిపుణుల బృందం హాజరై శస్త్రచికిత్సలు చేస్తారని వెల్లడించారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వైద్యనిపుణుల బృందం హాజరయ్యారు.



మాట్లాడుతున్న డాక్టర్ పీవీ రామారావు

17న ఫన్‌టైమ్స్ నూతన కార్యవర్గం ఎన్నికలు

నేటి నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

పటమట, న్యూస్‌టుడే: పటమటలోని ఆర్టీసీ కాలనీ మున్సిపల్ ఇండోర్ స్టేడియం సొసైటీ(ఫన్‌టైమ్స్) నూతన కార్యవర్గ సభ్యులు, పాలకవర్గ సభ్యులను ఎన్నుకునేందుకు సెప్టెంబరు 17న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి పి.పరంధామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న నిర్వహించిన వర్కింగ్ కమిటీ సమావేశంలో ఎన్నికలను నిర్వహించేందుకు ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించి, ఎన్నికల నిర్వహణకు త్రిసభ్య కమిటీని ప్రతిపాదించి, ఆమోదించారన్నారు. ఈనెల 23వ తేదీన ఎన్నికల నోటిఫకేషన్‌ను జారీ చేశామని, 28వ తేదీ నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు నామినేషన్లు కార్యాలయంలో ఇస్తారన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4 నుంచి 7 గంటలలోపు పూర్తి చేసిన నామినేషన్లను ఫన్‌టైమ్స్ కార్యాలయంలో అందజేయాలన్నారు. సెప్టెంబరు 3వ తేదీలోపు నామినేషన్లు అందజేయాలన్నారు. సెప్టెంబరు 5న నామినేషన్లు పరిశీలిస్తారని, 8వ తేదీ రాత్రి 7 గంటలలోపు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చని చెప్పారు. 17వ తేదీన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించి, ఓట్లు లెక్కించి, నూతన కార్యవర్గాన్ని ధృవీకరిస్తారన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫన్‌టైమ్స్‌లో ఎన్నికలు జరుగుతాయని, మధ్యాహ్నం 2 నుంచి లెక్కింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. సుమారు 750 మంది సభ్యులు ఓటర్లుగా ఉన్నారన్నారు. పాలకవర్గానికి నామినేషన్ 17వ తేదీ సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటలలోపు నామినేషన్ దాఖలు చేయాలని, రాత్రి 7 గంటల నుంచి 7.30 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయని, అనంతరం ఫలితాలు ప్రకటిస్తారన్నారు. నామినేషన్ దరఖాస్తు, ఉపసంహరణ దరఖాస్తులను సభ్యులు స్వయంగా వచ్చి ఫన్‌టైమ్స్ కార్యాలయంలో పొందవచ్చని చెప్పారు. నామినేషన్ ఫారానికి నిర్ణీత రుసుముగా రూ.వెయ్యి నిర్ణయించామని, చెల్లించిన వారికి తిరిగి ఇవ్వరన్నారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే సభ్యులు విధిగా నెలవారీ సభ్యత్వ రుసుమును చెల్లించాలని, ఏ విధమైన బకాయిలు ఉండకూడదన్నారు. సభ్యులందరూ తమ గుర్తింపు కార్డులు తీసుకురావాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు తమ సహాయ సహకారాలను అందించాలని సభ్యులకు సూచించారు.

అమరావతి కంటి ఆసుపత్రి ప్రారంభం

సూర్యారావుపేట (విజయవాడ), న్యూస్‌టుడే: కంటి వైద్యంలో అత్యాధునిక వైద్య సౌకర్యాలు విజయవాడలో కూడా లభ్యమవుతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం సూర్యారావుపేట ప్రకాశం రోడ్డులో అమరావతి కంటి ఆసుపత్రిని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజయవాడ నగరంలో కూడా సామాన్య ప్రజలకు అందుబాటులో ఆధునిక వైద్యసదుపాయాలు అందుబాటులోకి రావటం అభినందనీయమన్నారు. ఆసుపత్రి వైద్యులు డాక్టర్ వేణు నాదెళ్ల, డాక్టర్ శైలజ కేతినేనిలు మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో అత్యాధునిక కంటి శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కాటరాక్ట్, రెటీనా, లాసిక్, కార్నియా శస్త్రచికిత్సలతో పాటు క్లిష్టమైన వ్యాధులకు చికిత్సలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కంటి వైద్యంలో అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ కూడా అందుబాటులో ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తుర్లపాటి కుటుంబరావు, నగరానికి చెందిన పలువురు కంటి వైద్యులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్